


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 2 సంచిక : 280 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 6 జనవరి 2025 | వెల : 4/-



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపుణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


# బాబోయ్ చలి


- రికార్డు స్థాయిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు..
- మరో 3 రోజులు భీభత్సమే
- నాలుగైదు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో వినిపిస్తున్న మాట.
- చలిభయంతో బయటకు వెళ్లాలంటేనే వణికిపోతున్న పరిస్థితి
- అదే సమయంలో ఆరోగ్య శాఖ నుంచి కూడా హెచ్చరికలు
- అప్రమత్తంగా లేకపోతే ప్రమాదమే అంటున్న వైద్యులు



# ఇకపై లవర్స్‌కు నో రూమ్స్!

ఓయో సంచలన నిర్ణయం.. రూమ్ బుక్ చేసుకునే సమయంలో తమ రిలేషన్‌షిప్‌ను నిర్ధారించే ఐడీ ప్రూఫ్‌ను సమర్పించాలి



## బీజేపీకి ఒక్క ఛాన్స్ ఇవ్వండి

- దేశ రాజధానిని అభివృద్ధి చేయగలిగే పార్టీ ఒక్క బీజేపీయే
- మనం 2025 సంవత్సరంలో ఉన్నాం
- 21వ శతాబ్దంలో 25 ఏళ్లు గడిచిపోయాయి..
- శతాబ్దంలో పావు సంవత్సరం ముగిసిపోయింది
- రాబోయే 25 ఏళ్లు భారతదేశ భవిష్యత్తుకు, ఢిల్లీ భవిష్యత్తుకు చాలా కీలకం
- ఈ పాతికేళ్లలో దేశం 'వికసిత్ భారత్'గా రూపొందనుంది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

## కన్ఫ్యూజన్‌లో
# గులాబీ కేడర్

- పార్టీ వ్యవహారాలను కేటీఆర్ లేదా కవితకు అప్పగించారా?
- పార్టీ కేడర్ ఎందుకు కన్ఫ్యూజన్‌లో పడింది?
- సీఎం రేసు కోసం కేటీఆర్-కవిత పోటీ పడుతున్నారా?
- ఇదే చర్చ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను వెంటాడుతోంది
- నేతల వలసలు కాసేపు పక్కన బెడితే..
- వయోభారం కారణంగా మాజీ సీఎం కేసీఆర్ మునుపటి మాదిరి గా రాజకీయాల్లో యాక్టివ్ కాలేకపోతున్నారు.

BHARAT RASHTRA SAMITHI BRS భారత రాష్ట్ర సమితి

హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారా? పార్టీ వ్యవహారాలను కేటీఆర్ లేదా కవితకు అప్పగించారా? పార్టీ కేడర్ ఎందుకు కన్ఫ్యూజన్‌లో పడింది? సీఎం రేసు కోసం కేటీఆర్-కవిత పోటీ పడుతున్నారా? ఇదే చర్చ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను వెంటాడుతోంది. అధికారం పోయిన తర్వాత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది బీఆర్ఎస్. నేతల వలసలు కాసేపు పక్కన బెడితే.. వయోభారం కారణంగా మాజీ సీఎం కేసీఆర్ మునుపటి మాదిరి గా రాజకీయాల్లో యాక్టివ్ కాలేకపోతున్నారు. ఇక అసలు విషయానికొద్దాం..పార్టీ - మిగతా3లో

## ఎన్ని ఇబ్బందులున్నా..
# రుణ మాఫీ చేస్తాం




- వారిద్దరి మాటలు చూస్తుంటే.. కడుపు తరుక్కుపోతోంది
- తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వ లేక పోతున్నారు
- ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 ఇళ్లకు తగ్గకుండా ఇస్తాం
- ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే రూ. లక్ష రుణమాఫీ సైతం చేయ లేక పోయారు
- బీఆర్ఎస్ రూ.7 లక్షల అప్పు చేసి కూడా రుణమాఫీ చెయ్య లేక చేతులు ఎత్తేసింది

వరంగల్

ఎన్ని ఇబ్బందులున్నా.. రైతులకు తాము రుణ మాఫీ చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రూ. లక్ష రుణ మాఫీ చేయ లేని వాళ్లు కూడా మాట్లాడుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలపై ఆయన మండిపడ్డారు. ఆదివారం వరంగల్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వ లేక పోతున్నారన్నారని మండిపడ్డారు. ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 ఇళ్లకు తగ్గకుండా ఇస్తామని ఆయన ప్రకటించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా - మిగతా3లో

- జాబ్ క్యాలెండర్‌పై సీఎం రేవంత్ కీలక ప్రకటన
- సివిల్స్ మెయిన్స్ ఉత్తీర్ణత సాధించిన 20 మందికి ఆర్థిక సాయం
- సివిల్స్ ఇంటర్వ్యూ కు ఎంపికైన ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయం
- సివిల్స్‌లో సత్తా చాటిన అభ్యర్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సాహం
- సింగరేణి సంస్థ సహకారంతో ప్రతిభ కలిగిన పేద అభ్యర్థులకు వెలుగులు నింపే ప్రయత్నం
- సివిల్స్ ఇంటర్వ్యూకు వెళ్తున్న అభ్యర్థులకు ఆర్థిక సాయం చేస్తూ భరోసా ఇచ్చింది తెలంగాణ ప్రభుత్వం.

## ఆర్థిక సాయం కాదు..
# ప్రోత్సాహం



హైదరాబాద్

సివిల్స్ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కులను సీఎం రేవంత్ అందించారు. 20 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చెక్కును ఇచ్చారు. సింగరేణి సంస్థ నుంచి ఈ ఆర్థిక సాయం అందించింది తెలంగాణ ప్రభుత్వం. ఈ ఆర్థిక సహాయం సివిల్స్ అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి అభిప్రాయపడ్డారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజాభవన్‌లో రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం కార్యక్రమం నిర్వహించారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. సివిల్స్ - మిగతా3లో



## రైతులకు మద్దతుగా
# బీఆర్ఎస్

- నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన కేటీఆర్
- రైతు భరోసాపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలి
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో రైతులకు మద్దతుగా నిరసనలు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గండం దాటేందుకు రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది

హైదరాబాద్

రైతు భరోసా ఎందుకు ఇవ్వరో రేవంత్ రెడ్డి చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతు భరోసాపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. రేపు రాష్ట్రవ్యాప్తంగా - మిగతా3లో

# ఒక్క చాన్స్ ప్లీజ్...
# నామినేటెడ్ ఎమ్మెల్సీల కోసం జోరుగా ప్రయత్నాలు

**బెంగళూరు:** విధానపరిషత్‌కు నామినేటెడ్ విధానంతో నలుగురిని ఎంపిక చేసేందుకు వీలున్నందున ఆశావాహులు తీవ్రస్థాయిలో లాబీ చేస్తున్నారు. సభ్యులు యూబీ వెంకటేష్, ప్రకాష్ రాథోడ్‌ల పదవీకాలం ముగిసింది. చెన్నపట్టణ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీ యోగేశ్వర్ బీజేపీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 27న జేడీఎస్ సభ్యుడు తిప్పేస్వామి పరిషత్ పదవీకాలం ముగియనుంది. ఇలా నాలుగు స్థానాలకు ఖాళీ ఏర్పడగా, కాంగ్రెస్ నుంచి ఎంపిక చేసే వెసలుబాటు ఉంది. అయితే ఆ స్థానాలకు ఏకంగా 20 మంది దాకా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. యూబీ వెంకటేష్, ప్రకాష్ రాథోడ్ మరోసారి అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ సభాపతి బీఎల్ శంకర్, మాజీ మంత్రి రాణి సతీషలు ఇప్పటికే సీఎంను కలిసి అవకాశం కోరినట్లు తెలుస్తోంది. నలుగురిని భర్తీ చేయాల్సి ఉన్నందున డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయంతో పాటు ఎఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను సంప్రదించాల్సి ఉంటుంది. ఇప్పటికే పలువురు ఇటు సీఎం, డీసీఎంలతోనే కాకుండా ఢిల్లీలో ఖర్గేతో పాటు ఇతర నేతల ద్వారా కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలాఖరులోగానే నలుగురిని ఎంపిక చేయడం ద్వారా పరిషత్‌లో ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల నాటికి బలం పెంచుకోదలచారు. నలుగురిని ఎంపిక చేయాలంటే సీఎం, డీసీఎంలు ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత అధిష్టానం ఆమోదం కూడా లభించాల్సి ఉంటుంది.



## భారీ బోర్డింగ్ పాస్ చూపించిన వ్యక్తి.. ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ సిబ్బంది ఏం చేశాడంటే?



**న్యూఢిల్లీ:** ఒక విమాన ప్రయాణికుడు విభిన్నంగా వ్యవహరించాడు. బోర్డింగ్ పాస్‌ను పెద్ద పేపర్‌పై ప్రింట్ తీశాడు. ఎయిర్‌పోర్ట్‌లోని సెక్యూరిటీ సిబ్బందికి దీనిని చూపించాడు. ఇది చూసి అతడు షాక్ అయ్యాడు. అందులోని వివరాలు పరిశీలించేందుకు కాస్త ఇబ్బంది పడ్డాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విమానంలో ప్రయాణించేందుకు ఒక వ్యక్తి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. గేట్ వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి భారీ సైజులో ప్రింట్ చేసిన బోర్డింగ్ పాస్‌ను రెండు చేతుల్లో పట్టుకుని చూపించాడు. ఇది చూసి ఆ సెక్యూరిటీ అధికారి అయోమయం చెందారు. పెద్ద పేపర్‌పై ప్రింట్ చేసిన టిక్కెట్ వివరాలను సరిచూసుకునేందుకు కాస్త ఇబ్బందిపడ్డారు. బోర్డింగ్ పాస్‌ను ఇలా ప్రింట్ చేయాలని నీ స్నేహితులకు చెప్పవద్దని నవ్వుతూ అన్నారు. కాగా, ఈ వీడియో క్లిప్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. 'వారు ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నారేమో' అని క్యాప్షన్ ఇచ్చారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నెటిజన్లు కూడా ఫన్నీగా స్పందించారు. ఫ్రాంక్ చేసేందుకు లేదా సోషల్ మీడియాలో ప్రయోట్ అయ్యేందుకు ఆ వ్యక్తి ఇలా చేసి ఉంటాడని కొందరు పేర్కొన్నారు. మరోవైపు ట్రావెల్ కంపెనీ మేక్‌మైట్రిప్ కూడా ఈ వీడియో క్లిప్‌పై స్పందించింది. పేపర్‌ను సేవ్ చేయాలని సూచించింది. తమ ద్వారా కొనుగోలు చేసిన విమాన టిక్కెట్లను వాట్సాప్‌లో కూడా చూపించవచ్చని పేర్కొంది. మీ ప్రయాణం కంటే మీ జీవితం, అభిరుచి పెద్దవని ప్రశంసించింది.

## ఇకపై లవర్స్‌కు నో రూమ్స్!

పెళ్లికి ముందే ప్రైవసీ కోసం ఎక్కువమంది ఎంచుకునే ఆప్షన్ ఓయో రూమ్స్. వివాహంతో సంబంధం లేకుండా పరస్పర అంగీకారంతో శారీరక సంబంధం కలిగిన వ్యక్తులు ఓయో రూమ్స్‌కు వెళ్తుంటారు. స్త్రీ, పురుషుల గుర్తింపు కార్డు చూపించి, టారిఫ్ చెల్లిస్తే ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా రూమ్స్ కేటాయిస్తారు. ఎక్కువమంది కాలేజీ అబ్బాయిలు, అమ్మాయిలు ఓయో సర్వీసెస్ ఉపయోగించుకుం టున్నారు. కొందరు ఓయో సర్వీసెస్‌ను తప్పుపడుతున్నారు. తమ పిల్లలు చెడిపోవడానికి ఇవి కారణమవుతున్నాయని విమర్శించేవాళ్లు ఉన్నారు. గత కొన్నేళ్లుగా ఓయో హాస్పిటాలిటి సేవలను అందిస్తోంది. తక్కువ ధరకే రూమ్స్ అందించడంతో ఓయో సర్వీసెస్ తక్కువకాలంలో అందరినీ ఆకర్షించాయి. అదే సమయంలో కపుల్స్ కాకపోయినా పరస్పర అంగీకారంతో అమ్మాయి, అబ్బాయి ఒకే రూమ్‌లో ఉండేందుకుఓయో హోటల్స్ అనుమతిస్తుండటంతో వీటికి డిమాండ్ పెరిగింది. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న ఘటనల దృష్ట్యా ఓయో హోటల్స్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది.

**వారికి నో ఎంట్రీ..**

ఓయో హోటల్స్‌లో రూమ్ బుక్ చేసుకోవడం ఎంతో ఈజీ. ఓయో యాప్‌లో రూమ్ బుక్ చేసుకుని, నేరుగా హోటల్‌కు వెళ్తే గది కేటాయిస్తారు. రూమ్‌లో ఉండే వ్యక్తుల గుర్తింపు కార్డు జిరాక్స్ హోటల్ రిసెప్షన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. అంతేతప్ప మిగిలిన ఏ వివరాలు అడగరు. ముఖ్యంగా ప్రైవసీ కోరుకునేవారికి ఓయో రూమ్స్ అనువైన ప్రదేశంగా చెబుతారు. ఇప్పటివరకు ఎవరైనాఓయోలో రూమ్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉండగా.. తాజాగా ఓయో పెళ్లి కాని జంటలకు రూమ్స్ ఇవ్వబోమనే కొత్త రూల్ తీసుకొచ్చింది. ఓయో తీసుకొచ్చిన నూతన చెక్ ఇన్ పాలసీలో పెళ్లి కాని జంటలు రూమ్‌ను బుక్ చేసుకునే అవకాశం ఉండదు. ఈ నిబంధనలను తొలుత ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అమలు చేస్తోంది. ఆ తర్వాత ఈ విధానాన్ని దేశమంతా విస్తరించే ఛాన్స్ ఉంది. ఇకనుంచి రూమ్ బుకింగ్ సమయంలో జంటలు తమ పెళ్లిని నిర్ధారించే గుర్తింపు కార్డును సమర్పించాలి. సురక్షితమైన, బాధ్యతాయుతమైన హాస్పిటాలిటీకి తాము కట్టుబడి ఉన్నామని ఓయో నార్త్ ఇండియా హెడ్ పవాస్ శర్మ తెలిపారు.

**గుర్తింపు చూపిస్తే..**

ఎవరైనా జంటలు ఓయోలో రూమ్స్ బుక్ చేసుకోవాలంటే వివాహ ధృవీకరణ లేదా, కపుల్స్‌గా ధృవీకరించే ఏదైనా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. గతంలో వలె రూమ్స్ బుక్ చేసుకునే విధానంలో స్వల్ప మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఓయో నిర్ణయాన్ని కొందరు స్వాగతిస్తుండగా.. ప్రేమికులకు మాత్రం ఇది షాకింగ్ అనే చెప్పుకోవాలి. జంటగా ధృవీకరించే పత్రాలు బుకింగ్ సమయంలో సమర్పించకపోతే వారికి రూమ్ బుక్ కాదనే చెప్పుకోవాలి.

## పూరీలోని జగన్నాథ ఆలయంపై ఎగిరిన డ్రోన్..
# కలకలం రేపిన ఘటన


**భువనేశ్వర్:** ఒడిశాలోని పూరీలో ఉన్న ప్రసిద్ధ జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. సుమారు అరగంట పాటు అక్కడ తిరిగింది. దీంతో ఈ సంఘటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 4.10 గంటల సమయంలో పూరీలోని జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. దానికి అమర్చిన కెమెరాలో ఆలయాన్ని చిత్రీకరించింది. కాగా, నో ఫ్లైయింగ్ జోన్ ప్రాంతమైన జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురడం కలకలం రేపింది.



భద్రతా లోపాలపై ఆందోళనకు దారి తీసింది. న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఈ సంఘటనపై స్పందించారు. జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురవేయడం చట్టవిరుద్ధమని, ఆమోదయోగ్యం కాదని అన్నారు. భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఆలయం చుట్టూ ఉన్న నాలుగు వాచ్‌టవర్ల వద్ద 24 గంటలపాటు పోలీస్ సిబ్బందిని మోహరించే చర్యలు చేపడతామని అన్నారు. మరోవైపు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పూరీ ఎస్పీ వెల్లడించారు. ఎవరో యూట్యూబర్ ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

## ఒకసారి జనాభా తగ్గుదల మొదలైతే దాన్ని అడ్డుకోవడం కష్టం..
# జోహో సీఈఓ హెచ్చరిక

**ఇంటర్నెట్ డెస్క్:** జనాభా తగ్గుదల ఒక్కసారి మొదలైతే పరిస్థితిని చక్కదిద్దడం చాలా కష్టమని జోహో కార్పొరేషన్ సంస్థ సీఈఓ శ్రీధర్ వెంబు తాజాగా హెచ్చరించారు. చైనా, జపాన్‌లోని పరిస్థితులను ఇందుకు తాజా ఉదాహరణగా పేర్కొన్నారు. "1990ల్లో జపాన్ సాంకేతికంగా ఉచ్ఛస్థితికి చేరుకుంది. అమెరికాను కూడా చైనా మించిపోనుందని అప్పట్లో జనాలు చెప్పుకునేవారు. కానీ ఇప్పుడేమైందీ.. అక్కడి జనాభా తగ్గిపోవడంతో కొత్త సమస్యలు ప్రారంభమవు తున్నాయి" అని ఆయన తాజాగా ట్వీట్ చేశారు. ప్రస్తుతం చైనాలో కూడా దాదాపు ఇదే పరిస్థితి పునరావృతమవుతోం దని అన్నారు దేశాల్లో పారిశ్రామీకరణ, నగరీకరణ జరుగుతున్న తీసుకునే నిర్ణయాలు, సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతుండటం, చిన్న కుటుంబాల సంఖ్య పెరగడం తదితరాలు జనాభా తగ్గుదలకు దారి తీస్తాయని శ్రీధర్ వెంబు చెప్పారు. "ఒక్కసారి జనాభా తగ్గుదల మొదలైతే దాన్ని అడ్డుకోవడం చాలా కష్టం. నాకు తెలిసి ఈ పరిస్థితి అడ్డుకున్న దేశం ఒక్కటి కూడా లేదు. అందుకే నేను గ్రామీణ జీవనానికి, మన సంప్రదాయాలవైపు మొగ్గు చూపుతాను" అని ఆయన అన్నారు. జంటలను పిల్లల్ని కనేలా ప్రోత్సహించే అభివృద్ధి విధానాలకే తన మద్దతు అని స్పష్టం చేశారు. మిగతావేటికీ ఇంత ప్రాముఖ్యత లేదని స్పష్టం



చేశారు. భారత జనాభాలో మార్పులపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో జోహో సీఈఓ వ్యాఖ్యలు మరోసారి నెట్టింట ట్రెండింగ్‌లోకి వచ్చాయి. జనాభా స్థిరీకరణకు సంతానోత్పత్తి రేటు 2.1 కాగా దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ రేటు 1.6కి చేరుకుంది. దీంతో, జనాభాలో వృద్ధుల సంఖ్య పెరిగి దేశంపై భారం పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గతేడాది నవంబర్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనాభా తగ్గుదలతో ప్రమాదాలపై కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. జనాభాలో ప్రతికూల మార్పులను అడ్డుకునేందుకు తక్షణ చర్యలు అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా రోడ్లను నున్నగా చేస్తా..

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో తర్వలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రానున్న ఎన్నికల్లో తాను గెలిస్తే కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చెంపల మాదిరిగా తన అసెంబ్లీ నియోజకవర్గంలోని రోడ్లను నున్నగా చేస్తానని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఢిల్లీ సీఎం అతిషిపై కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రమేష్ బిధురి ఆదివారం ఒక కార్యక్రమంలో మాట్లాడారు. 'బీహార్ రోడ్లను హేమమాలిని చెంపల వలె నున్నగా చేస్తానని లాలూ యాదవ్ ఒకసారి ప్రస్తావించారు. కానీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చడంలో ఆయన విఫలమయ్యారు. అయితే ఓఖ్లా, సంగమ్ విహార్‌లోని రోడ్లను మేం అభివృద్ధి చేశాం. అదే మాదిరిగా కల్కాజీలోని ప్రతి రహదారి ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా నున్నగా ఉండేలా చూస్తాం' అని అన్నారు. కాగా, బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురి వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఆ పార్టీ నాయకురాలు సుప్రియా శ్రీనాట్ ఘాటుగా విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు సిగ్గుచేటని అన్నారు. బీజేపీ మహిళా వ్యతిరేక ఆలోచనకు ఇది నిదర్శమని ఆరోపించారు. 'ప్రియాంక గాంధీ గురించి రమేష్ బిధూరి చేసిన ప్రకటన సిగ్గుచేటు మాత్రమే కాదు, మహిళల పట్ల ఆయన అసహ్యకరమైన మనస్తత్వాన్ని కూడా చూపుతున్నది. తోటి



ఎంపీపై పరుష పదజాలం వాడి ఎలాంటి శిక్ష అనుభవించని వ్యక్తి నుంచి ఇంకేం ఆశించాలి? బీజేపీ అసలు ముఖం ఇదే' అని ఎక్స్‌లో విమర్శించారు.

## జేడీఎస్ నిర్వీర్యానికే.. ఆపరేషన్ హస్త కుట్ర

ప్రలోభ పెట్టినట్లు ఎమ్మెల్యేలు స్వయంగా చెప్పారు..

12 మందిని పార్టీ మార్చే ప్రయత్నాలు జరిగాయి

కేంద్రమంత్రి కుమారస్వామి సంచలన ఆరోపణ



**బెంగళూరు:** జేడీఎస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకే ఆపరేషన్ హస్త కుట్ర పన్నారని కేంద్రమంత్రి కుమారస్వామి సంచలనమైన ఆరోపణలు చేశారు. బెంగళూరులో కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ జేడీఎస్ పార్టీకి చెందిన 12-13 మంది ఎమ్మెల్యేలను పార్టీ మార్పించే ప్రయత్నాలు జరిగాయన్నారు. అయితే జేడీఎస్ ఎమ్మెల్యేలను మార్పు చేయడం అంత సులువు కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాపాలు పెరిగాయన్నారు. తమ ఎమ్మెల్యేలు తనకు పూర్తీ సమాచారం అందించారన్నారు. సంక్రాంతి ముగిసే దాకా ఏమీ మాట్లాడేది లేదన్నారు. జేడీఎస్ ఇటువంటి కుట్రలకు భయపడేది లేదని, జేడీఎసను ఎప్పటికీ నిర్వీర్యం చేయలేరన్నారు. దేవుడే కాంగ్రెస్‌కు తగిన శిక్ష వేస్తారన్నారు. దేశంలో గ్యారెంటీలకు పోటీ పడుతున్నారన్నారు. తొలుత అమలు చేసిన హిమాచల్ ప్రదేశ్ పరిస్థితి ఏం జరిగిందో తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో ఎటువంటి పరిస్థితి ఉందో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రాంట్ల కోసం ఎన్ని తంటాలు పడుతున్నారో అందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆత్మాభిమానం ఉంటే ప్రభుత్వం ఏదిశగా వెళుతుందో దృష్టి సారించాలన్నారు. మైసూరులో ప్రిన్సస్(మహారాణి) పేరుతో ఉండే రోడ్డుకు సిద్దరామయ్య పేరు పెట్టాలనే ప్రస్తావనపై ఆయన ఎద్దేవా చేశారు. కర్ణాటకకే సిద్దరామయ్య పేరు పెడితే బాగుంటుందన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా తమ పార్టీ సీనియర్ నేత జీటీ దేవెగౌడతో తనతో భార్యాభర్తల సంబంధమన్నారు. ఎన్నోసార్లు గొడవలు జరుగుతాయని ఆతర్వాత సమిసిపోతాయన్నారు.

## బీజేపీకి ఒక్క ఛాన్స్ ఇవ్వండి



**న్యూఢిల్లీ:** ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఢిల్లీ ప్రజలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. దేశ రాజధానిని అభివృద్ధి చేయగలిగే పార్టీ ఒక్క బీజేపీయేనని అన్నారు. రోహిణిలో ఆదివారంనాడు జరిగిన 'బీజేపీ పరివర్తన యాత్ర'లో ఆయన మాట్లాడుతూ, మనం 2025 సంవత్సరంలో ఉన్నామని, 21వ శతాబ్దంలో 25 ఏళ్లు గడిచిపోయాయని, శతాబ్దంలో పావు సంవత్సరం ముసిగిపోయిందని అన్నారు. ఈ 25 ఏళ్లలో రెండు, మూడు తరాల యువతరం ఢిల్లీలో ఎదిగిందని, రాబోయే 25 ఏళ్లు భారతదేశ భవిష్యత్తుకు, ఢిల్లీ భవిష్యత్తుకు చాలా కీలకమని చెప్పారు. ఈ పాతికేళ్లలో దేశం 'వికసిత్ భారత్'గా రూపొందనుందని అన్నారు. "ఢిల్లీలో ఈరోజు వేల కోట్లు విలువచేసే అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన జరిగింది. రాబోయే 25 ఏళ్లు, దేశానికి, ఢిల్లీకి చాలా కీలకం. వికసత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం" అని ప్రధాని చెప్పారు. ఢిల్లీ ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని, ఢిల్లీని బీజేపీ అభివృద్ధి పథకంలోకి తీసుకువెళ్తుందని భరోసా ఇచ్చారు. గత పదేళ్లలో 'విపత్తు'నే చూశామని, అభివృద్ధేనే ఢిల్లీ ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజల కోసం బీజేపీ పనిచేస్తుందని నమ్మకం ప్రజలకు ఉందని అన్నారు. ప్రజావిశ్వాసం చూరగొనడం వల్లే హర్యానా, ఒడిశా, మహారాష్ట్ర వంటి పలు ఎన్నికల్లో పార్టీ గెలుపొందిందని, ఈసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుస్తుందనే గట్టి నమ్మకం ఉందన్నారు.

**ప్రపంచంలోనే బెస్ట్ సిటీగా..**

ఢిల్లీకి ప్రపంచంలోనే ఉత్తమ నగర హోదాను తీసుకురాగలిగే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని మోదీ అన్నారు. 'ఆప్‌దా'ను ఢిల్లీ నుంచి తొలగించి ఢిల్లీ ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు ఇదే తగిన సమయమని పేర్కొన్నారు.

# బాబోయ్ చలి



తెలుగు రాష్ట్రాలపై చలిపులి..పంజా విసురుతోంది. ఉన్నట్లుండి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు గజ గజ వణికిపోతున్నారు. పెరిగిన చలి తీవ్రతతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. అయితే.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి మెదక్ జిల్లాను చలి వణికిస్తోంది.. సంగారెడ్డి జిల్లా జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది.. ఇక రాత్రి పూట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి.. రాష్ట్రంలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత కోహిర్ లో 6 డిగ్రీలు నమోదు అయ్యింది. ఈ సీజన్లో జిల్లాలో ఇదే అత్యల్ప ఉషోగ్రత.. సంగారెడ్డి జిల్లాలోని 22 ప్రాంతాల్లో 10 డిగ్రీల కంటే తక్కువ ఉషోగ్రతలు నమోదు కాగా.. మెదక్ జిల్లాలో ఆరు చోట్ల 10 డిగ్రీల కంటే తక్కువ ఉషోగ్రతలు నమోదయ్యాయి.. తెలంగాణలో చలితీవ్రత మరో 3 రోజులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తగ్గుతాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు తలిపారు.

**రోజంతా చలి పంజా..**

రోజంతా చలి పులిలా పంజా విసురుతోంది.. వేకువజామున మొదలవుతున్న దట్టమైన పొగమంచు కమ్మేస్తూ ఉదయం 12గంటలు దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు.. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు.. బయటకు రావాలంటేనే జనం జంకే పరిస్థితి ఏర్పడింది.. గత కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగా చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోతున్నాయి..రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత సంగారెడ్డి జిల్లాలోని కోహిర్ లో 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. న్యాల్ కల్ 6.3.. అల్మాయి పేట 7.3, మల్ చెల్మ7.5, నల్లవల్లి 7.7, అల్గోల్ 7.9, సత్వార్ 8.1, బీహెచ్ఈఎల్ 8.2, నిజాంపేట్ 8.5, ఝరాసంగం 8.7, కంకోల్ 9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

మెదక్, సిద్దిపేట జిల్లాలో కన్నా సంగారెడ్డిజిల్లాలో చలి తీవ్రత ఎక్కువ ఉంది.. చాలా చోట్లా సింగిల్ డిజిట్ నెంబర్ కి పడిపోతున్నాయి ఉష్ణోగ్రతలు%ొ% ప్రతిరోజు మార్నింగ్ వాక్ కు వెళ్లే అలవాటున్న వాకర్స్, తెల్లవారుజామున 5 గంటలకే నిద్రలేచి మార్నింగ్ వాక్ వెళతారు..పెరిగిన చలి కారణంగా వాకర్స్ ఉదయాన్నే లేవడం లేదు..చలికి భయపడి బయటకు రావడం లేదు.. ఉదయం 7 గంటలు దాటాక మార్నింగ్ వాక్ కు బయలు దేరుతున్నారు.

**వైద్యుల సూచనలు..**

ఉష్ణోగ్రతలు విపరీతంగా పడిపోతుండటంతో ఆస్తమా పేషంట్లు, వృద్ధులు, చిన్నారులకు ప్రమాదమని వైద్య నిపుణులు చెపుతున్నారు.. అనూహ్యంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో పెరుగుతున్న దగ్గు, జలుబు బాధితులపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలంటున్నారు.. రెండేళ్ల లోపు పిల్లలు, 65 ఏళ్లు దాటిన వృద్ధులు ఈ చలి కారణంగా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పిల్లల్లో శ్వాసకోశ సంబంధిత సమస్యల తీవ్రత సాధారణ పరిస్థితులతో పోలిస్తే 20 శాతం నుంచి 30 శాతం పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. వృద్ధులపై చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. అ అప్పర్ రెస్పిరేటరీ ఇన్? ఫెక్షన్ గా చెప్పబడే ఈ సమస్య ఎక్కువైతే ముక్కు కారడం.. ఊపిరి తిత్తుల్లోకి చల్లగాలి వెళితే వాయు నాళాలు కుచించుకు పోయి శ్వాస ఇబ్బందితో దగ్గు కూడా తీవ్రమవుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.


# ఆర్థిక సాయం కాదు.. ప్రోత్సాహం

-మొదటిపేజీ తరువాయి

మెయిన్స్ ఉత్తీర్ణత సాధించిన 20 మందికి ఆర్థిక సాయం అందజేశారు. సివిల్స్ ఇంటర్వ్యూ కు ఎంపికైన ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. సింగరేణి ఆధ్వర్యంలో సివిల్స్ అభ్యర్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసమే తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో నిరుద్యోగులు ఎంతో నష్టపోయారని .. అలాంటి పరిస్థితుల్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు.

సివిల్స్‌లో తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులు ఎక్కువ మంది రాణించాలని తమ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. బీహార్ నుంచి అత్యధికంగా సివిల్స్‌లో రాణిస్తున్నారని అన్నారు. అలాంటి ప్రత్యేక శ్రద్ధ తెలంగాణ రాష్ట్రంలో కూడా ఉండాలని, వారికి ఆర్థికంగా సహకారం అందించాలని రాజీవ్ సివిల్స్ అభయహస్తం ద్వారా రూ.లక్ష సాయం అందిస్తున్నామని ప్రకటించారు. ఇది ఆర్థిక సాయం కాదు%ొ% ప్రభుత్వం వారికి అందిస్తున్న ప్రోత్సాహంగా భావించాలని అన్నారు. కష్టంతో కమిట్మెంట్ ఉంటేనే విజయం వరిస్తుందని చెప్పారు. ఇంటర్వ్యూకు వెళ్లే ప్రతీ ఒక్కరూ సివిల్స్‌లో సెలెక్ట్ అవ్వాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి ఏడాదిలోనే 55143 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గుర్తుచేశారు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

14 ఏళ్లుగా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేని.. కానీ తాము అడ్డంకులను, కుట్రలను అధిగమించి 563 గ్రూప్ 1 ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించామని ఉద్ఘాటించారు. మార్చి 31 లోగా 563 గ్రూప్ 1 ఉద్యోగాల నియామకాలను పూర్తిచేయబోతున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ఆలోచించేది యువత భవిష్యత్ కోసమే అని చెప్పారు. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులను అన్నిరకాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. దేశంలో అత్యధికంగా మన రాష్ట్రం నుంచి సివిల్స్‌లో ఎంపికవుతారని గర్వంగా చెప్పుకునే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదుగుతోందని అన్నారు. గ్లోబల్ సిటీ హైదరాబాద్‌లో అవకాశాలు ఎక్కువ అని చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. తెలంగాణకు అత్యధిక పెట్టుబడులు రావాలని చెప్పారు. ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. తమ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తుందని అన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



అత్యంత వెనుకబడిన బిహార్ నుంచి సివిల్స్‌కు అత్యధికంగా ఎంపికవుతున్నారు. బిహార్‌లో ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్లే ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపికవుతున్నారని సీఎం రేవంత్ అన్నారు. అలాంటి సహకారం అందించాలనే ఆలోచనతోనే సివిల్స్ అభ్యర్థులకు ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. ఇది ఆర్థిక సాయం కాదు. అభ్యర్థులకు అందిస్తున్న ప్రోత్సాహంగా భావించాలన్నారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులు ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా రాష్ట్రానికి సేవ చేయాలన్నారు.

**ఏడాదిలోనే 55వేల 143 ఉద్యోగాలు ఇచ్చాం**

గ్రూప్ 1 సహా అనేక ఉద్యోగాల భర్తీ చేస్తుంటే.. నిరుద్యోగులను రెచ్చగొట్టి కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55వేల 143 ఉద్యోగాలు ఇచ్చాం. గతంలో ఎన్నడూ లేని విధంగా 563 గ్రూప్ 1 ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. ఇన్ని ఉద్యోగాలు ఇస్తుంటే తట్టుకోలేక.. ప్రతిపక్షాలు అడ్డుకునే కుట్ర చేస్తున్నాయని సీఎం రేవంత్ ఆరోపించారు. గ్రూప్ 1పై కుట్రలన్నీ ఛేదించి పరీక్షలు నిర్వహించాం. మార్చి 31 లోపు ఈ నియామకాలు పూర్తి చేస్తామన్నారు సీఎం రేవంత్.

**ఎక్కువ మంది రాణించాలనే ఆలోచనతో ప్రోత్సాహం**

గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో నిరుద్యోగులు ఎంతో నష్టపోయారని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేసుకుంటూ వస్తోందన్నారు. సివిల్స్‌లో మన రాష్ట్ర అభ్యర్థులు ఎక్కువ మంది రాణించాలనే ఆలోచనతో ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఏదైనా సాధించాలనే తపన, కష్టంతో కూడిన కమిట్మెంట్ ఉంటేనే విజయం వరిస్తుందని ఈ సందర్భంగా అభ్యర్థులకు సూచించారు. ఇంటర్వ్యూకు వెళ్లే ప్రతీ ఒక్కరూ సివిల్స్‌లో సెలెక్ట్ కావాలని ఆకాంక్షించారు.

# కన్ఫ్యూజన్‌లో గులాబీ కేడర్

-మొదటిపేజీ తరువాయి

వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు, రెండు వారాల కిందట ఫ్యామిలీ సభ్యులతో కేసీఆర్ సమావేశమయ్యార. దీనికి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు మరో ముగ్గురు కీలక నేతలు హజరయ్యారు. అనారోగ్యం, వయో భారం కారణంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలనే ఆలోచన బయటపెట్టారట. పార్టీకి కావాల్సిన సలహాలు మాత్రం ఇస్తానని, మీ ముగ్గురు పార్టీ వ్యవహారాలు చూసుకోవాలని చెప్పారట పెద్దాయన.ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా తాను కొద్దిరోజులు కంటిన్యూ అవుతానని అన్నారట. వీలు కుదిరినప్పుడు అసెంబ్లీకి వచ్చి వెళ్తానని, సమావేశాలు సైతం మీరే చూసుకోవాలని తెలిపారట. అయితే పార్టీలో ఎవరికి ఏయే పదవులు అన్నదానిపై నోరు ఎత్తలేదని తెలుస్తోంది.ఇటీవల మీడియాతో చిట్ చాట్ చేసిన కేటీఆర్, ప్రస్తుతం కేసీఆర్ రెస్టు తీసుకుంటున్నారని అన్నారు. అంతేకాదు పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరుగుతాయని చెప్పడం వెనుక ఉద్దేశం ఇదేనని అంటున్నారు. దీంతో అధ్యక్షుడు పోటీకి కేటీఆర్–కవిత మధ్య పోటీ నెలకొందని తెలుస్తోంది.కార్యకర్తలతో సమావేశం పెట్టినప్పుడల్లా హార్డ్ కోర్ అభిమానులు మాత్రం కేటీఆర్ సీఎం.. కవిత సీఎం స్లోగన్ చేయడం కూడా అధిపత్యం ఎవరి ఎత్తులు వారు వేస్తున్నట్లు చెబుతున్నారు పార్టీ నేతలు. జరుగుతున్న పరిణామా లను గమనించిన కారు పార్టీ కార్యకర్తలు కాసింత




డైలామాలో పడిపోయారు. రేపోమాపో స్థానిక ఎన్నికలు రానున్నాయి. ఎన్నికల ముందు ఈ తరహా కన్ఫ్యూజన్ కరెక్ట్ కాదనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనివల్ల కేడర్ చెదిరిపోయే పరిస్థితి తలెత్తవచ్చని అంటున్నారు.పార్టీ వ్యవహారాలు కేటీఆర్–కవిత చుట్టూ తిరగడంతో హరీష్‌రావు మద్దతుదారులు ఆసక్తి గమనిస్తున్నారు. పార్టీలో ఇంత జరుగుతున్నా, తమ అభిమాన నేత నోరు మెదప పోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. దీనిపై అప్పుడే పార్టీలో చిన్నపాటి చర్చ మొదలైపోయిందిఒకప్పుడు రూరల్‌గా బలంగా ఉండేది కారు పార్టీ. మొన్నటి ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లు ఝలక్ ఇచ్చారు. ఈ క్రమంలో పార్టీలో అంతర్గత వ్యవహారాలు కేడర్‌తోపాటు నేతలకు మింగుడుపడడం లేదు. ఈ వ్యవహారం రాబోయే రోజుల్లో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వెయిట్ అండ్ సీ.

## ఇంకా ఎన్నాళ్లు తప్పించుకుంటారు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు ఫైర్



హన్మకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, ఇతర నాయకులను నిర్బంధించడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రైతు భరోసా పేరిట కాంగ్రెస్ చేసిన మోసంపై వరంగల్ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి రిప్రజెంటేషన్ ఇచ్చే ప్రయత్నం చేస్తే అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 7,500 ఇస్తామని చెప్పి మాట తప్పిన మీ తీరును చూసి యావత్ తెలంగాణ రైతాంగం చీదరించుకుంటున్నదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు విమర్శించారు. ఎక్కడ రైతులు తిరగబడతారో అని.. మంత్రుల పర్యటనల్లో భారీగా పోలీసులను మోహరించి ఎన్నాళ్ళు తప్పించుకుంటారని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా మిమ్మల్ని ఎండగడుతూనే ఉంటామని.. ఎక్కడిక్కడ నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. పెద్ది సుదర్శన్ రెడ్డితో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఎన్ని ఇబ్బందులున్నా.. రుణ మాఫీ చేస్తాం



-మొదటిపేజీ తరువాయి

పేరుతో భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేల ఇస్తామన్నారు. బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా తమ పథకాలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఆపబోమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ గత 10 ఏళ్లలో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే రూ. లక్ష రుణమాఫీ సైతం చేయ లేక పోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ రూ.7 లక్షల అప్పు చేసి కూడా రుణమాఫీ చెయ్య లేక చేతులు ఎత్తేసిందని ఎద్దేవా చేశారు. తాము ఇచ్చిన హామీలను నిబద్ధతతో కచ్చితంగా అమలు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రూ. 2 లక్షల లోపు ఉన్న రైతులకు రుణ మాఫీ కాకపోతే తప్పకుండా చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్ రావు, కేటీఆర్‌లు అడ్డగోలుగా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిద్దరి మాటలు చూస్తుంటే.. కడుపు తరుక్కుపోతుందని వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 56 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఇక రైతులకు బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కానీ ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ.. తన సోషల్ మీడియాతోపాటు తన పత్రికలో విషప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. ప్రతి ఎకరాకు ఎలాంటి షరతులు లేకుండా తమ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తుందని ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 26వ తేదీన నుంచి రైతు భరోసా పంపిణీ చేస్తామన్నారు. ఎవరు అడ్డ పడిన.. ఎన్ని కుట్రల చేసిన రైతు భరోసా పథకాన్ని మాత్రం అమలు చేసి తీరుతామని చెప్పారు. రైతుల పక్షానే తమ ప్రభుత్వం నిలబడుతోందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కార్యకర్తలకు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క్ పిలుపు నిచ్చారు.

## రైతులకు మద్దతుగా బీఆర్ఎస్




-మొదటిపేజీ తరువాయి

అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో రైతులకు మద్దతుగా నిరసనలు తెలుపుతామని తెలిపారు. హార్టికల్చర్ రైతులకు రైతు భరోసా ఇస్తారా ఇవ్వరా అనే దానిపై క్లారిటీ లేదని అన్నారు. ఉద్యోగులకు భూమితో సంబంధం లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గండం దాటేందుకు రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విమర్శించారు. రైతుబంధు పథకం ఉండాలా వద్దా అనేది రైతులు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకోండి, నిలదీయండి అని పిలుపునిచ్చారు. నమ్మి ఓటేసిన పాపానికి పచ్చి మోసానికి పాల్పడ్డ ఈ కాంగ్రెస్‌ను రైతన్నలు పాతరేస్తారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ చేసిన దానికి మోసం అనే పదం చిన్నదైపోతది. దగా, నయవంచన పదాలు కూడా సరిపోవని విమర్శించారు. కాంగ్రెస్ రైతాంగానికి చేసిన ఈ ద్రోహం.. తెలంగాణ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. కపట నాటకాలకు, నోరు తెరిస్తే అబద్ధాలకు, బూటకపు వాగ్దానాలకు కేరాఫ్ కాంగ్రెస్/రేవంత్ అని రైతాంగానికి అర్థమైపోయిందని అన్నారు. తెలంగాణ చరిత్రలో రేవంత్ రైతుద్రోహిగా మిగిలిపోతాడని చెప్పారు. డిక్లరేషన్ కాదు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చే గ్యారెంటీ అని రాహుల్ గాంధీ అన్నారని కేటీఆర్ గుర్తుచేశారు. రైతు భరోసా 12 వేలకు కుదించి సంబరాలు చేయాలని కాంగ్రెస్ అంటోంది.. కానీ ఎందుకు సంబరాలు చేయాలి.. రైతన్నలకు 15000 ఇస్తామని చెప్పి కోతలు పెట్టినందుకా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం మాయమాటలు చెప్పి మోసం చేసినందుకు పాలాభిషేకాలు చేయాలా అని నిలదీశారు. కాంగ్రెస్ అబద్దాలకు డిక్షనరీలో కొత్త పదాలు కనిపెట్టాలని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ, రైతుబంధుకు కేసీఆర్ లక్ష కోట్లు ఖర్చు పెట్టారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ రైతుబంధుగా నిలిచారు కానీ.. రేవంత్ రెడ్డి రాబందుగా మిగులుతారని విమర్శించారు. రాహుల్ గాంధీకి తెలంగాణకు వచ్చే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో డిసెంబర్ 3కు ముందు తీసుకుంటే 10 వేలు, తరువాత 15 వేలు రైతు భరోసా అన్న కాంగ్రెస్ నేతల మాటలు ఎక్కడ పోయాయని నిలదీశారు. గతంలో ఇచ్చిన పదివేలనే బిచ్చం అన్న రేవంత్.. మరి నువ్వు పెంచిన వెయ్యి రూపాయలు ఏంటి? ముష్టి వేస్తున్నావా అని మండిపడ్డారు.

# సంపాదకీయం

## మరోరూపంలో మూడు చట్టాలు

రైతుల ఆందోళనకు తలొగ్గి గతంలో వెనక్కి తీసుకున్న మూడు సాగు చట్టాల్లోని అంశాలకు వేరే ముసుగులు తగిలించి తిరిగి ప్రవేశపెట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎత్తులు వేస్తున్నదా? అప్పట్లో వాటి రద్దు సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఇప్పుడు పోరాడుతున్న రైతులు ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోసం పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని శంభు వద్ద రైతులు పది నెలలుగా ఆందోళన చేస్తుంటే వారితో చర్చలకు ముందుకు రాకపోగా, ఇప్పుడు రద్దు చేసిన సాగు చట్టాలకు మించిన భయంకరమైన యంత్రాంగాన్ని మరో రూపంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించడం రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నది. 'కాలగర్భంలో కలిసిపోయాయనుకున్న మూడు నల్ల చట్టాలు మళ్లీ నెత్తిన పడతాయన్న భయం రైతులను వెంటా డుతున్నది. అందుకు తగ్గట్టుగానే 'అగ్రికల్చర్ మార్కెటింగ్' (ఎన్‌పీఎఫ్ఏఎం)పై కేంద్రం జాతీయ విధాన ముసాయిదా రూపొందించడం రైతుల ఆందోళనకు గురిచేస్తున్నది. 2021లో రద్దుచేసిన మూడు సాగు చట్టాలను దొడ్డి దారిన తీసుకొచ్చేందుకే ఈ ప్రయత్నమని, వాటి తో పోలిస్తే ఇది మరింత ప్రమాదకరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'కిసాన్ ఆందోళన్-2.0' పేరుతో 9 నెలలుగా కొనసాగుతున్న పోరాటంలో కిసాన్ యూనియన్ సిద్ధూపూర్ రాష్ట్ర అధ్యక్షుడైన జగ్జీత్‌సింగ్ డల్లేవాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. హర్యానా-పంజాబ్ సరిహద్దులోని ఖనౌరీలో నవంబర్ 26న ఆయన ఆమరణ దీక్ష చేపట్టి రైతు ఉద్యమాన్ని మలుపుతిప్పారు. దీని తర్వాత రైతు ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యం పెరిగింది. డల్లేవాల్ దీక్షను భగ్నం చేయడం, రైతుల ఒత్తిడితో తిరిగి విడుదల చేయడం వివాదాస్పదమైంది. సుప్రీం ఆదేశాలతోనే డల్లేవాల్ దీక్షను భగ్నం చేశామని పోలీసులు అంటుంటే.. తామెన్నడూ అలా ఆదేశించలేదని సర్వోన్నత న్యాయస్థానం చెప్తున్నది. ఇక, పంట ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ) మార్కెట్లను రద్దు చేయడంతోపాటు కాంట్రాక్ట్ సాగును ప్రోత్సహిస్తూ నిరుడు నవంబర్ 25న ముసాయిదా విధానాన్ని కేంద్రం విడుదల చేసింది. గతంలో తీసుకొచ్చిన మూడు సాగుచట్టాల్లో ఇది కూడా ఒకటి కావడంతోనే అప్పట్లో రైతులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పుడు మళ్లీ దీనిని దొడ్డిదారిన తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుండటంపై మరోమారు పిడికిలెత్తారు. గత హామీల అమలు కోసం పోరాడుతుంటే అది పట్టని కేంద్రం ఇప్పుడు సాగు మొత్తాన్ని ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ఆలోచన చేస్తుండటం రైతులను విస్మయానికి గురిచేస్తున్నది. దీనికితోడు పంజాబ్‌లో ఏపీఎంసీ మార్కెట్ల విధానాన్ని సమూలంగా మార్చాలని చూస్తుండటంతో రైతులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అంతేకాదు, ముసాయిదా పాలసీపై స్పందించేందుకు రాష్ట్రాలకు కేంద్రం రెండువారాల సమయం మాత్రమే ఇవ్వడం వెనుక ఉన్న ఉద్దేశం కూడా ఇదేనని అంటున్నారు. కాబట్టి పంజాబ్ వెంటనే దీనికి వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, అన్ని రాష్ట్రాలు ఇదే వైఖరి అవలంబించాలని రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన అగ్రికల్చర్ మార్కెటింగ్ ముసాయిదా పాలసీలో ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్లను ఏర్పాటు చేయడం, ప్రాసెసర్లు, ఎగుమతిదారు లు, వ్యవస్థీకృత రిటేలర్లు, బల్క్ బయ్యర్లను నేరుగా హోల్‌సేల్ కొనుగోలుకు అనుమతించడం వంటివి రైతుల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. ముఖ్యంగా కాంట్రాక్ట్ సాగుపై ప్రభుత్వం పట్టుబట్టడం విమర్శలకు గురవుతున్నది. ఇది అమల్లోకి వస్తే తమ పొలంలో తామే కూలీలుగా మారిపోతామన్న భయం వారిలో వ్యక్తమవుతున్నది. మరోవైపు, దీనిపై రైతుల ఆందోళన అవసరం లేద ని, వారి మేలుకోసమే దీన్ని తీసుకొస్తున్నట్టు కేంద్రం చెప్తున్నది. ప్రైవేటు మార్కెట్ల మధ్య పోటీ పెరిగితే రైతుల మేలుకే దోహదం చేస్తుందని, వారి నికర ఆదాయాన్ని పెంచాలన్నదే తమ యోచన అని కేంద్రం వాదిస్తున్నది. ఎన్‌పీఎఫ్ఏఎం నిస్సందేహంగా రద్దు చేసిన వ్యవసాయ చట్టాలకు 'బ్యాక్ డోర్ ఎంట్రీ' ఇస్తుందని ఎస్‌కేఎం నేత రాజేవా ల్ చెప్తున్నారు. కొత్త ముసాయిదా విధానంతో ప్రైవేటు వ్యాపారులకు గిడ్డంగులు నిర్మించుకునేందుకు అనుమతి లభిస్తుందని, కాబట్టి ఇది ఆమోదయోగ్యం కాదం టున్నారు. ఏది ఏమైనా ఈ పాలసీని వ్యతిరేకించి తీరుతామని రైతులు భీష్మించుకూర్చున్నారు. రైతు సంఘాలను మరోమారు ఏక తాటిపైకి తెచ్చి దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని, ఇందుకోసం ఎంతవరకైనా కొట్లాడతామని ఆ సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ,ఫారెస్ట్ ట్రేక్ పార్క్ ఆధ్వర్యంలో రాక్ బే నేచర్ క్యాంప్







**రాజేంద్రనగర్,జనవరి05** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్ బ్రాండ్ పేరుతో ఫారెస్టైక్ పార్క్ వద్ద రాక్ బే నేచర్ క్యాంప్ నిర్వహించారు. ఈ నేచర్ క్యాంప్ లో 20 మంది ఔత్సాహికులు హైదరాబాద్ లోని వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్నారు.ఈ నేచర్ క్యాంపు శనివారం సాయంత్రం 3 గంటలకు ప్రారంభమై ఆదివారం ఉదయం 10 గంటలకు ముగిసింది.క్యాంప్ లో పాల్గొనాలనుకున్న వారందరూ పార్క్ లో గల రైన్ ట్రీ రచ్చబండ దగ్గర హాజరు కాగా వారికి ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్,ప్రాజెక్ట్స్ మేనేజర్,ఎకో టూరిజం కె.సుమన్,హెడ్ నేచురలిస్ట్ అఖిల్ నేచర్ క్యాంపు గురించి జరగబోయే కార్యక్రమాల గురించి,ఫారెస్ట్ ట్రెక్ పార్క్ గురించి వారికి వివరించారు.ఈ నేచర్ క్యాంపు మొదటగా నేచర్ వాక్‌తో ప్రారంభమైంది.నడక మధ్యలో చెట్ల ఉపయోగాలను, వాటి నుండి మనం ఉపయోగించే వస్తువుల గురించి వివరించారు.తరువాత వారందరినీ రాక్ క్లైంబింగ్, రాపెల్లింగ్,కమాండోనెట్,స్కై వాక్ కోసం అడ్వెంచర్ యాక్టివిటీస్ జోన్‌కు తీసుకెళ్లారు.అడ్వెంచర్ కార్యక్రమం పూర్తి అయిన తరువాత వారికి ఫలహారాలు అందించారు. అనంతరం క్యాంపింగ్ టెంట్ ఎలా వేసుకోవాలి (పిచింగ్), క్యాంపింగ్ అనంతరం దానిని ఎలా విప్పాలి అనే దానిపై ప్రదర్శన ఇచ్చి పాల్గొనేవారికి ఎవరి టెంట్ వారికే వేసుకునేలా చేశారు.అనంతరం క్యాంపు సైట్ వద్ద క్యాంప్ ఫైర్ వేసి వైల్డ్ లైఫ్ కథలు,అడవుల్లో ఏదైనా జంతువు ఎదురైతే ఏఏ జంతువుకు ఎలా ప్రతిస్పందించాలో తెలియజేశారు. పాములు మీద అవగాహన వంటి అంశాల మీద చర్చ ఏర్పాటు చేసి అడవుల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం అందరికీ విందు ఏర్పాటు చేసారు.భోజనం అనంతరం రాత్రిపూట నడక చేయించారు.ఆదివారం ఉదయం 5.45 గంటలకు బర్డ్ వాక్ కార్యక్రమం ఏర్పాటు చేసి అందరికి పక్షులను గుర్తించుటకై పక్షుల బొమ్మలు వాటి పేర్లు కలగలిపిన బ్రౌచర్ లు,వాటి వీక్షణ కొరకై బైనాక్యులర్స్ అందించారు.ఈ బర్డ్ వాక్ కార్యక్రమంలో కనిపించిన 18 రకాల పక్షుల గురించి,వాటి యొక్క ప్రవర్తన గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో 18 రకాల పక్షులను వారు తిలకించారు. పిమ్మట పెద్ద చెరువు వద్దకు గుట్టల మీదుగా ట్రెక్కింగ్ చేసి పెద్దచెరువు వద్ద బ్రేక్ఫాస్ట్ చేశారు.ఈ యొక్క



నేచర్ క్యాంప్ లో పాల్గొనే వారికి వివిధ చెట్ల యొక్క ప్రాముఖ్యతలను తెలియజేయడానికి,పర్యావరణం అంశాలు, వాటిని సంరక్షించవలసిన ప్రాముఖ్యత, నగరంలోని సహజ నిర్మిత వనరులపై కూడా అవగాహన కల్పిస్తారని,టిజిఎఫ్ డిసి తరుపున ఇక మీదట ప్రతీ శనివారం,ఆదివారం ఈ ప్రకృతి శిభిరం (నేచర్ క్యాంప్ లు) నిర్వహిస్తామని,ఆసక్తి గల వారు 9493549399,9885298980నంబర్లను సంప్రదించాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్ వివరించారు.రానున్న రోజుల్లో ప్రకృతి పర్యాటకానికి పెద్ద పీట వేసి (మద్యం నిషేధిత) నేచర్ క్యాంపులను ప్రోత్సాహిస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ వి. తనూజ,ప్లాంటేషన్ మానేజర్ లక్ష్మారెడ్డి, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్,ప్రాజెక్ట్స్ మానేజర్ సుమన్,హెడ్ నేచురలిస్ట్ అఖిల్,వాండేరింగ్ బీ రాఘవేంద్ర, ప్రసాద్, సతీష్,ఓం ప్రకాష్,బాబు,వెంకట్,టిజిఎఫ్డిసి సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బిఆర్ఎస్ పార్టీకి లేదు





**-పదేళ్లలో అభివృద్ధి చేయని ప్రభుత్వం,ఒక్క సంవత్సరంలోనే చేస్తారని అనే నైతిక హక్కు లేదు**


**-రేషన్ కార్డులు ఇవ్వకుండా 10 సంవత్సరాలు నిర్లక్ష్యం చేశారు**

**-ఈనెల 28 నుంచి రైతు భరోసా అందిస్తాం.**

**-రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**ముత్తారం/పెద్దపల్లి,జనవరి 05(సూర్యరేఖ):**పదేళ్లు రాష్ట్రాన్ని ఏలిన బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని,మా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మేము ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని తాపత్రయంతో ముందుకు నడుస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.ముత్తారం మండలంలోని మైదంబండలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి,ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలవుతాయన్నారు.ప్రజలు 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి చేస్తుందని వేచి చూశారని,కాని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందియలేకపోయారని అన్నారు.ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి 6 గ్యారంటీలు అమలు పరిచేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రయత్నం చేస్తున్నారన్నారు.కొంచెం ఆలస్యం అయినా కానీ తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్నిటిని నిలబెట్టుకొని ప్రజల ముందుకు పోతామని అన్నారు.రైతు సోదరులకు సంబంధించి యావత్ రాష్ట్రంలోని రైతాంగ సోదరులకు రూ.21 వేల కోట్ల రూపాయలు,రూ.2లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయడం,దానికి తోడు క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి సహచర మంత్రి వర్గం అందరూ కూడా రైతు భరోసా ఇచ్చే కార్యక్రమం కూడా ఏర్పాటు జరుగుతున్నాయని అన్నారు.కానీ బీఆర్ఎస్ పార్టీ,బిజెపి పార్టీ వాళ్లు రైతు భరోసా ఇవ్వరని అసత్య ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు.ఎన్నికల సమయంలో తామిచ్చిన 6 గ్యారంటీలలో భాగంగా భూమిలేని కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా మొదటి దాఫలో రూ.6 వేలు ఈ నెలలో ఇవ్వబోతున్నామన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు పెట్టుబడి సాయం కింద పదివేల రూపాయలు ఇస్తే,తమ ప్రజా ప్రభుత్వంలో ఎకరాకు రూ.12 వేల రూపాయలు ఇచ్చే కార్యక్రమం ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు.సాగులో యోగ్యత ఉన్న ప్రతి రైతు కుటుంబాలకు రైతు భరోసా ఎకరాకు రూ.12 వేల రూపాయలు అందించే దిశలో ప్రయత్నం జరుగుతుందని, అదేవిధంగా రైతులకు సన్న ఒడ్లకు రూ.500 రూపాయల బోనస్ కల్పించి,రైతులను రాజులు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు రైతు భరోసా ఈనెల 28వ తేదీ నుంచి మొదలు కాబోతుందని అన్నారు.రైతుకు సంబంధించి ఏ విషయంలో కూడా రాజీ పడకుండా మా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.అదేవిధంగా రేషన్ కార్డులు ఇవ్వకుండా 10 సంవత్సరాలు నిర్లక్ష్యం వహించిన గత ప్రభుత్వాలు తమ ప్రభుత్వం ఏర్పాటుతో పది సంవత్సరాల నుంచి పెండింగ్ లో ఉన్న రేషన్ కార్డులను కూడా ఇవ్వబోతున్నామన్నారు.పది సంవత్సరాల క్రితం పెళ్లిళ్లు అయినా యువకులకు రేషన్ కార్డు లేక చాలా ఇబ్బందులు పడ్డారని,అది పరిగణలకు తీసుకొని మా కాంగ్రెస్ ప్రభుత్వంలో రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి తాము ఒక కార్యక్రమానికి నాంది పలుకుతున్నామని,ఇవన్నీ కూడా ఒక సంవత్సర కాలంలోనే పనిచేస్తూ ఉంటే బీఆర్ఎస్,బిజెపి పార్టీకి సంబంధించిన వారు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని,గత పది సంవత్సరాలుగా అభివృద్ధి చేయలేని ప్రభుత్వాలు,ఒక్క సంవత్సరంలోనే చేస్తలేరని అనడానికి వారికి నైతిక హక్కు లేదన్నారు.మంత్రి వెంట కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రముఖ పారిశ్రామికవేత్త మన్నె సుబ్రహ్మణ్యంకు నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి,వేం నరేందర్ రెడ్డి





**సీఎంతో పాటు పాల్గొన్న పరమేశ్వర్‌రెడ్డి..**

**ఉప్పల్,జనవరి05(సూర్యరేఖ)**ప్రముఖ పారిశ్రామికవేత్త, సమాజ సేవకుడు ఇటీవల కాలం చేసిన మన్నె సుబ్రహ్మణ్యం కు సీఎం రేవంత్‌రెడ్డి,ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేం నరేందర్ రెడ్డి నివాళిఅర్పించారు.మన్నె సుబ్రహ్మణ్యం పెద్ద కర్మ ఆదివారం ఉప్పల్ నియోజకవర్గంలోని చర్లపల్లిలోని శ్రీ కృష్ణ కన్వెన్షన్‌లో జరిగింది.పెద్ద కర్మకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై మన్నె సుబ్రహ్మణ్యం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మన్నె సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను కలిశారు. కార్యక్రమం ప్రారంభం నుంచి చివరి వరకు సీఎం రేవంత్‌రెడ్డి వెంట ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఉన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రాంమోహన్,మాజీ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి,మేడ్చెల్ ఇంచార్జి వజ్రేష్ యాదవ్,కందికంటి అశోక్ గౌడ్,చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి,సీత రామ్ రెడ్డి,టిజికే మూర్తి, పావని రెడ్డి,ఆకారపు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మంగాపురం కాలనీ కాలనీ సంక్షేమ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్**

**ఉప్పల్ జనవరి 05(సూర్యరేఖ)** మీర్ పేట్ హెచ్ బికాలనీ డివిజన్ మంగాపురంకాలనీ సాయిబాబా దేవాలయంలో బాబాను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్,మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అశోక్ రెడ్డి,సెక్రటరీ రవిందర్ రెడ్డి, శివపాములు సోములు, శ్రీనివాస్ గౌడ్,రామ్మోహన్ చార్లు, వెంకటరెడ్డి, నాగేశ్వరశర్మ, కిరణ్ కుమార్, శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి,నరసింహారెడ్డి, పురుషోత్తం, కనకయ్య, వాసు,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులలో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు తప్పవు





**కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్**

**శ్రీనగర్ కాలనీలో రూ.63 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్**

**ఉప్పల్,జనవరి 05(సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్లోని శ్రీనగర్ కాలనీలో సుమారు రూ.54 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ఆదివారం కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పర్యవేక్షించారు.అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ...జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు డిఈ. వెన్నెల గౌడ్,ఏఈ వినీత్ రావు సీసీ రోడ్డు పనుల పర్యవేక్షణ చేయాలని నాణ్యత ప్రమాణాలు కాంట్రాక్టర్ పాటించే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.నాణ్యత పాటించని కాంట్రాక్టర్లపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగింది.అనంతరం కాలనీ వాసులు కార్పొరేటర్ కి ఎన్నో సంవత్సరాల నుంచి కలగా మిగిలిపోయిన సిసి రోడ్లు వేయించినందుకు అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఈ.వెన్నెలగౌడ్ ,ఏ.ఈ వినీత్ రావ్, టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కోకొండ జగన్ రామాంజనేయులు, శ్యామ్,నాగరాజు, శ్రీనివాస్,కాలనీ అధ్యక్షులు కొండయ్య సభ్యులు,శ్రీహరిరెడ్డి,దేవేందర్ రెడ్డి, ఐలయ్య, మనోహర్రావు, అంజయ్య,సత్యనారాయణ,నాగేశ్వర శర్మ ,ఉపేందర్, లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 1న శ్రీ మార్కండేయ జయంతిని 2000 మందితో ఘనంగా నిర్వహించాలి

**బీరప్పగడ్డ పద్మశాలి సంఘం సమావేశంలో తీర్మానం**

**ఉప్పల్,జనవరి 05(సూర్యరేఖ)**బీరప్పగడ్డ శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆదివారం ఈస్ట్ కళ్యాణ్ పురి కమ్యూనిటీ హాల్ లో సమావేశం జరిగింది.నూతన పద్మశాలి కమిటీ, యువజన కమిటీ,మహిళా కమిటీలను వేసుకోవడం జరిగింది.ఈ సమావేశంలో ఉప్పల్ ప్రాంతంలో పద్మశాలిలకు వైకుంఠధామం స్మశాన వాటికీ లేదని,స్మశాన వాటిక సాధనకు కృషి చేయాలని, ఫిబ్రవరి 1వ తేదీన శ్రీ మార్కెండేయ జయంతిని 2000 మందితో నిర్వహించాలని తీర్మానించారు.ఈ సమావేశాని కి సుమారు 150 మంది సంఘం సభ్యులు హాజరయ్యారు. పద్మశాలి కులస్తులు రాజకీయంగా ఎదగాలని అందుకు అవసరమైన కార్యచరణ కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమములో సామల నాగరాజు, గుజ్జరి సత్యనారాయణ, రాచకొండ శివ కుమార్, సామల బాలకృష్ణ, తలకొక్కుల లక్ష్మీనారాయణ, కర్రె మల్లేష్,అడేపు మధు, గుల్లపల్లి నాగరాజు, సామల కృష్ణ, యెన్నం రాజేందర్, మహేశుని రవీందర్, క్యాతం శ్రీనివాస్, తమ్మల




శ్రీను, హరీష్, మహేష్ తమ్మల చంద్రిక, అనుగుల రేణుక, పద్మశాలి కుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్కూల్ అటెండర్ రాములు కుటుంభానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం




**ఉప్పల్,జనవరి 05(సూర్యరేఖ)** ఉప్పల్ ప్రాథమిక పాఠశాలలో గతకొన్నేళ్ళుగా తాత్కాలిక అటెండేర్ గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన రాములు కుటుంబానికి ఉప్పల్ జిల్లా పరిషత్ హైస్కూల్ 1993-94 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. మానవతా దృక్పథంతో స్పందించి ఆదివారం రాములు కుటుంబానికి రు.26 వేల నగదు అందజేశారు.ఈ కార్యక్రమంలో 1993-94 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

## హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించిన

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**పాల్గొన్న నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన శేఖర్**




**ఉప్పల్,జనవరి 05(సూర్యరేఖ)**నాచారం హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన క్యాలెండర్-2025 ను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి,నాచారం కార్పొరేటర్ శాంతి సాజన్ శేఖర్ తో కలిసి ఆదివారం వెల్ఫేర్ భవనంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... హెచ్ఎంటి నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.స్థానిక కార్పొరేటర్ మీకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు,జాయింట్ సెక్రెటరీ కిరణ్,రామ్ కోటేశ్వరరావు,నరసింహ,సతీష్,కులకర్ణి, బుచ్చయ్య,కిషన్,నర్సింగ్ రావు,నరసింహ,శర్మ తదితరులు పాల్గొన్నారు

## మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు..

**అభినందించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్,జనవరి 05(సూర్యరేఖ)** నాచారం రాఘవేంద్రనగర్ లోని పోచమ్మ గుడి వద్ద ఆదివారం నాచారం డివిజన్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన శేకర్ విచ్చేసి వారు వేసిన ముగ్గులను చూసి అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న, రాజబాబు,తోట ప్రభావతి, శ్రీనివాస్, దోర్నాల లీలావతి,పప్పుల రవీందర్, సాయిరాం, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాయకులు సాయి జన్ శేఖర్,కట్ట బుచ్చన్నగౌడ్, దాసరి కర్ణ,రామచందర్, లడ్డు,శివబాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గానికి వచ్చిన సీఎంని కలిసిన ఆకారపు అరుణ్ పటేల్



**ఉప్పల్,జనవరి 05(సూర్యరేఖ)** ప్రముఖ పారిశ్రామికవేత్త,సమాజ సేవకుడు ఇటీవల మృతిచెందిన మన్నె సుబ్రహ్మణ్యంకు సీఎం రేవంత్‌రెడ్డి,మందముల పరమేశ్వర్ రెడ్డిలు నివాళులర్పించారు.మన్నె సుబ్రహ్మణ్యం పెద్ద కర్మ ఆదివారం చర్లపల్లిలోని శ్రీ కృష్ణ కన్వెన్షన్ లో జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ కుమార్ కలిశారు.పెద్ద కర్మ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్,ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నాయకులు పాల్గొని మన్నే సుబ్రహ్మణ్యంకు నివాళులర్పించారు.

# పరిమళించిన మానవత్వం..

**బ్రెయిన్ డెడ్ అయిన కానిస్టేబుల్ పెద్దోళ్ల ప్రశాంత్ రెడ్డి అవయవ దానానికి సహకరించిన కుటుంబ సభ్యులు**

**అవయవదానం ద్వారా మరొక మనిషికి ప్రాణం పోయడం ఎంతో గొప్ప విషయం:**

**సీపీ సుధీర్ బాబు**

**ఉప్పల్,జనవరి 05(సూర్యరేఖ)** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కందుకూరు పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తూ ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మరణించిన పెద్దోళ్ల ప్రశాంత్ రెడ్డి శరీర అవయవాలను కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో దానం చేశారు.తమ కుటుంబ సభ్యుడు ఇక లేరని బాధలో ఉన్నప్పటికీ ఆపదలో ఉన్న ఇతర ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చారు. డిసెంబర్ 28వ తేదీన డ్యూటీ ముగించుకొని ఉప్పల్ లోని విజయపురి కాలనీ తన ఇంటికి ఇంటికి తిరిగి వస్తుండగా రాత్రి పది గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొనగా తలకు బలమైన గాయాలు తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు.వెంటనే చికిత్స నిమిత్తం మలక్ పేట యశోద ఆసుపత్రి తీసుకెళ్ళగా చికిత్స పొందుచూ శనివారం మరణించారు.ప్రశాంత్ రెడ్డి అవయవాలను తండ్రి రిటైర్డ్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ నాగిరెడ్డి,భార్య సౌమ్య జీవన్ దాన్ కు కిడ్నీలు,కాలేయం అప్పగించారు.తమ బిడ్డ ప్రాణం పోయిన బాధను తమ గుండెల్లో దాచుకుని కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు రావడాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు ఐపిఎస్ అభినందించారు.మృతుని కుటుంబాన్ని శాఖాపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు.






ఆర్గాన్ డొనేషన్ చేసిన వారు భౌతికంగా మరణించినప్పటికి జీవించి ఉన్నట్లేనని, అవయవదానం ద్వారా మరొక మనిషికి ప్రాణం పోయడం ఎంతో గొప్ప విషయం అని కమిషనర్ పేర్కొన్నారు.ఉప్పల్ లో ఆదివారం జరిగిన కానిస్టేబుల్ ప్రశాంత్ రెడ్డి అంత్యక్రియల ఖర్చులకు కమిషనర్ రూ.90 వేలు మంజూరు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి సీపీ తరపున మహేశ్వరం ఏసిపి లక్ష్మికాంత రెడ్డి హాజరై ప్రశాంత్ రెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఇన్స్పెక్టర్ సీతారాం, రాచకొండ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్ భద్రారెడ్డి,రాచకొండ కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సువర్ణ,బ్యాచ్ మెట్స్,తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య తీర్చండి..





**శివంపేట,జనవరి05(సూర్యరేఖ)** శివంపేట మండల కేంద్రంలో తరచూ మంచినీటి సమస్య నెలలో చాలాసార్లు వస్తున్నది అయినా కూడా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి మంచినీటి సమస్యను పరిష్కరించడం లేదు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో మంచినీటి సమస్య ఎప్పుడు కూడా రాలేదని బిఆర్ఎస్ కార్యకర్త గొట్టిముక్కల వెంకటేష్ ఈ సందర్భంగా తెలియజేశారు.తెలంగాణలో ఆడపడుచులు ఎప్పుడు కూడా తాగునీటి సమస్యకు ఇబ్బంది పడలేదు.ఈ సమస్యను యుద్ధ ప్రతిపాదికన పరిష్కరించాలి, ఎందుకు సమస్యను పరిష్కరించడం లేదు అని అధికారులను కోరుతున్నాడు.ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సమస్య అనేది చాలా ముఖ్యమని వారు ఆలోచించి ఈ సమస్యను సత్వరం పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుంది. పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్.



**కామారెడ్డి,జనవరి05(సూర్యరేఖ)** రైతు అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్ అన్నారు.రైతు భరోసాతో పాటు రుణమాఫీ కానీ రైతులకు త్వరలో రైతు రుణమాఫీ అవుతుందని సంక్రాంతి నుండి ఎకరాకు 12 వేల రూపాయల చొప్పున మరియు భూమిలేని వారికి 12 వేల రూపాయలు చొప్పున కాంగ్రెస్ పార్టీ ఇస్తుందని ఆమె అన్నారు.ఆధార్ కార్డు పట్టా పాస్ బుక్కులలో చిన్నచిన్న తప్పులతో రుణమాఫీ కానీ రైతుల సమస్యలను రెవెన్యూ వ్యవసాయ అధికారులు పరిష్కరించి రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ సర్కార్ రైతు అభివృద్ధి కొరకు కృషి చేస్తుందని ఆమె అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటుందని ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు.ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుకునేందుకు రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు.

## వాహనదారులకు అవగాహన కల్పించిన సీఐ







**కొల్చారం,జనవరి 05(సూర్యరేఖ)** కొల్చారం మండలం ఏడుపాయల టీ జంక్షన్ వద్ద ఆదివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ భద్రత మాసోత్సవ సందర్భంగా వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని,లైసెన్స్ కలిగి ఉండాలని,మద్యం సేవించి వాహనాలు నడపవద్దని వాహనదారులకు మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి, కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్,పోలీస్ సిబ్బంది, వాహనదారులకు సూచించారు.

## వంజరి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ..



**నిజాంపేట,జనవరి5(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని వంజరి సంఘంలో ఆదివారం రాష్ట్ర వంజరి సంఘం ఉపాధ్యక్షులు వై. వెంకటేశం,వంజరి కులస్తుల ఆధ్వర్యంలో వంజరి సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. వంజరి కుల బాంధవులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.వంజరి కులంలో 90 శాతం పైబడి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు పదివేల రూపాయలను అందిస్తూ వారిపై చదువుల కొరకు అండగా నిలుస్తున్నామన్నారు.మునుమందు వంజరి సంఘ కులస్తులకు అండగా ఉంటూ కుల సంఘ అభివృద్ధికి తోడ్పడుతామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ వంజరి సంఘం అధ్యక్షులు సదాశివలింగం,ఉపాధ్యక్షులు కొండేరు ప్రభాకర్,ప్రధాన కార్యదర్శి మావురం లక్ష్మణ్,కార్యదర్శి మావురం అంజయ్య,కోశాధికారి ఆముదరాజు,చంద్రశేఖర్,సిద్ధరాములు,కృష్ణకాంత్,వెంకటయ్య,నరేష్,సాయి,సరవ్వ,రాజు, బాల్ రాజు,తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేస్తా






**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,జనవరి 05(సూర్యరేఖ)**మల్లాపూర్ రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రెడ్డి సంఘం అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి,బండారి నీలంరెడ్డి, మల్లాపూర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు కాసం రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి,రెడ్డి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాసీంపూర్ తండాలో సర్పంచ్ ఎన్నికపై గ్రామస్తుల తీర్మానం..



**నిజాంపేట,జనవరి05(సూర్యరేఖ)** మండల పరిధిలోని కాసింపూర్ తాండ గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచ్ ఎన్నికపై గ్రామ పెద్దల సమక్షంలో గ్రామానికి చెందిన లౌడ్యా రామచందర్ నాయక్,ను ఏకగ్రీవ తీర్మానం చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ...రానున్న స్థానిక ఎన్నికలలో సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేసేందుకు లౌడ్యా రామచందర్ నాయక్ ముందుకు వచ్చి సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు అందిస్తామని తెలపడంతో గ్రామ పెద్దల సమక్షంలో గ్రామంలోని నాలుగు వార్డు సభ్యులందరూ కలిసి సర్పంచ్ కొరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు.ఈ కార్యక్రమంలో తండా నాయకులుకిషన్,మోతిరామ్,లచ్చిరాం,విట్టల్ సేవ,దేవరాజ్, రాజు, మంగ్య,రవి,సుమన్,రాజేందర్,బొజ్జ,బాబు,తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమం



**కామారెడ్డి,జనవరి05(సూర్య రేఖ)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత మాసోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిటిఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం ధర్మారం టోల్ ప్లాజా వద్ద వాహనాలకు రోడ్డు భద్రత రేడియం స్టిక్కర్లను వేశారు.ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటుందని ప్రజలందరూ సహకరించాలని శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు నాగలక్ష్మి, సురేష్, రాములు, కానిస్టేబుల్స్,హోంగార్డ్స్ పాల్గొన్నారు.బాన్సువాడలో న్యూ ట్రెండ్స్ స్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు ఏఎంవి అధికారి కే మహేష్ కుమార్, హోంగార్డ్ అనిల్ రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ స్కూల్, మద్నూర్ జడ్పీహెచ్ఎస్ మాచారెడ్డి,జెడ్పిహెచ్ఎస్ స్కూల్లో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహ న కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంవీఐ నాగలక్ష్మి,రజిని సురేష్ తో పాటు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# బూర్గుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ లింక కిష్టయ్య మృతి..

## లింక కిష్టయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు..



**మెదక్ / కొల్చారం,జనవరి05(సూర్యరేఖ)** నక్సలైట్ల ప్రాబల్యం ఉన్న గ్రామం..హావేళి ఘణపురం మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో అర్ధరాత్రి నక్సలైట్ల భయం..ఉదయాన పోలీసుల భయం గుప్పిట్లో 15 సంవత్సరాలుగా సర్పంచ్ గా రాత్రి పగలు తేడా లేకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేసిన సాధారణమైన వ్యక్తి లింక కిష్టయ్య..!!శనివారం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడంతో బూర్గుపల్లి గ్రామంలో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి.1995-2001,2001-2006, 2006-2012 లలో మూడు పర్యాయాలు సర్పంచ్ గా పనిచేశారు.అంతే కాకుండా 2014-2019లో లలిత కిష్టయ్య ఎంపిటీసి ఇండిపెండెంట్ గెలిచి పని చేశారు. ఎంపిటీసి ఎలక్షన్ లో ఇండిపెండెంట్ గా గ్రామ పంచాయితీ భవనం దాతల సహకారంతో నిర్మాణం చేశారు.అంతే కాకుండా గ్రామస్థులకు వాటర్ ట్యాంకుల నిర్మాణం చేసి నీళ్ళను అందించిన ఘనత ఆయనకు దక్కడం విశేషం.కాగా అనారోగ్యంతో శనివారం మృతి చెందిన విషయాని గ్రామస్థులు తెలియ జేయడంతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కసిరెడ్డి మాణిక్యరెడ్డి,వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.కాగా పలువురు వారి కుటుంభానికి కాంగ్రెస్ పార్టీ రూ. 5 వేలు,బీఆర్ఎస్ పార్టీ రూ.5వేలు గ్రామ ముదిరాజ్ సంఘం రూ.5 వేలు,శెట్టి బాబు రూ.5 వేలు కిష్టయ్య కుటుంభానికి ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాని చాటుకున్నారు.బూర్గుపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

# నేడు అరంఘర్ నుంచి జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభం






## అందుబాటులోకి రానున్న 4.04 కిలోమీటర్ల ఫ్లై ఓవర్.!

**రాజేంద్రనగర్,జనవరి 05** హైదరాబాద్‌లోని అరంఘర్ నుండి జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభ తేదీని ప్రకటించడంతో ఎట్టకేలకు నిరీక్షణకు తెరపడింది.ఈ ఫ్లైఓవర్ ప్రారంభం కావడంతో అరంఘర్-బహదూర్‌పురా మధ్య ట్రాఫిక్ ప్రవాహాన్ని సులభతరం చేస్తుంది. జనవరి 6 హైదరాబాద్‌లోని అరంఘర్ ఫ్లైఓవర్ ప్రారంభ తేదీగా నిర్ణయించబడింది. సోమవారం సాయంత్రం 4 గంటలకు ఈ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.హైదరాబాద్ ఎంపీ,ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీతో కలిసి జూపార్క ఫ్లైఓవర్ ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ చేసున్నారు. వాస్తవానికి డిసెంబర్ 3, 2024న ప్రారంభించాలని నిర్ణయించారు.గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ముఖ్యమంత్రి చేత ప్రారంభించబడాలని అనుకున్న తర్వాత ఫ్లైఓవర్ ప్రారంభ తేదీ వాయిదా పడింది.ఈ ఫ్లైఓవర్ 4.04 కిలోమీటర్లు విస్తరించి ఉంది.ఇది హైదరాబాద్‌లో రెండవ పొడవైన ఫ్లైఓవర్‌గా నిలిచింది. ఆరు-లేన్,ద్వి-దిశల నిర్మాణంగా రూపొందించబడింది, ఇది అరంఘర్ ను నెహ్రూ జూలాజికల్ పార్క్‌తో కలుపుతుంది. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది.ఫ్లైఓవర్ కార్యాచరణలోకి వచ్చిన తర్వాత అరంఘర, శాస్త్రిపురం, కాలాపత్తర్, దారుల్ ఉలూమ్, శివరాంపల్లి, హస నగర్ ప్రాంతాలలో ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తే మా లక్ష్యం..







**రాజేంద్రనగర్ మండలంలో 8 రోజులు కొనసాగిన 11 స్పోర్ట్స్ ఈవెంట్లలో పాల్గొన్న 6000 మంది విద్యార్థులు..**


**రాజేంద్రనగర్,జనవరి 05**రాజేంద్రనగర్ మండల పరిధి లోని ప్రతి ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించ డంతో పాటు వారిలో క్రీడాస్ఫూర్తిని కలిగించడమే తమ అసోసియేషన్ లక్ష్యం అని రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం క్రీడల కార్యదర్శి బోయ లక్ష్మణ్ అన్నారు. అందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో 8 రోజుల పాటు నిర్వహించిన ప్రైవేట్ పాఠశాలల అంతర క్రీడోత్సవాలు నిదర్శనమని ఆయన చెప్పారు. ఆదివారం గురునానక్ స్కూల్లో నిర్వహించిన కబడ్డీ మనో యాక్షన్ పోటీలతో రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల అంతర క్రీడల పోటీలు ఘనంగా ముగిశాయి.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి.శరవణ్ కుమార్, కోశాధికారి ఎస్ఆర్.రజనీకాంత్ లతో కలసి బోయ లక్ష్మణ్ మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 6000 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన, రన్నింగ్, క్యారమ్స్ ,చెస్,స్పెల్ బి,అథ్లెటిక్స్,షాట్ పుట్ పోటీలతో పాటు చివరి రోజు కబడ్డీ,మోనో యాక్షన్ పోటీలతో కలిపి మొత్తం 11 స్పోర్ట్స్ ఈవెంట్లు విజయవం తంగా పూర్తి చేశామన్నారు.సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో బాలురు, బాలికలు పోటాపోటీగా ఈ క్రీడల్లో తమ సత్తాచాటారని వివరించారు. ఉమ్మడిగా ప్రైవేటు పాఠశాలలు ఇంత పెద్ద ఎత్తున క్రీడలను నిర్వ హించడం రంగారెడ్డి జిల్లాలోనే కాదు రాష్ట్రంలో గతంలో ఎప్పుడు జరగలేదని వారు పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రీడా చైతన్యం తీసుకువస్తే వారు మంచి క్రీడాకారులుగా రాణించినప్పుడు అది ఆ విద్యార్థి చదువుకున్న పాఠశాలకే కాదు, ప్రాంతానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ఏ.యాదగిరి, మండల సంఘం ప్రతినిధులు డాక్టర్ సంజీవ, ఏపీ చారి కరుణాకర్ , వాజిద్, పి.మనోహర్, సందీప్,శేషు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేడు హిమాయత్ సాగర్ లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**గండిపేట్,జనవరి 05** హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని పిఅండ్ టికాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరల నిమిత్తం సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు.ఈ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన పిఅండ్ టికాలనీ ఎబిసి,స్పెషల్ బ్లాక్స్ వై జంక్షన్, కీర్తి రిచ్మండ్ విల్లాస్, పోచమ్మ టెంపుల్, హైయ్యర్ ఇంక్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### కిస్మత్ పూర్ లో..

కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని డాన్ బెస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు వివిధ మరల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు.ఈ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన మిచెల్ కాలనీ, వినాయకనగర్, డీడీకాలనీ, కాళీమందిర్, ఎన్ఎఫ్ సి కాలనీ, ఆదర్శనగర్,ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, అరుణోదయనగర్, సంధ్యానగర్, జిఆర్ నగర్, మాచన్పల్లి ఎంక్లేవ్,బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన ఆరే మైసమ్మ ప్రధాన రహదారి, కాళికానగర్, ఎన్ఎఫ్ సి కాలనీ,మల్లికార్జున నగర్, ఆదర్శనగర్ రోడ్ నెంబర్ 1 నుండి 5 వరకు, న్యూకేర్ హాస్పిటల్,గాయత్రినగర్,వికాస్ నగర్, ద్వారకానగర్, యాదవ మిత్రకాలనీ, శిరిడి సాయిబాబాకాలనీ, ప్రశాంత్ కాలనీ, ప్రశాంత్ నగర్ కమ్యూనిటీ హాల్,భరత్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.



## డాక్టర్ సీతారాం,డాక్టర్ పోతున్న మానవత్వానికి మారు పేర్లు..

**మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ**



**రాజేంద్రనగర్,జనవరి05** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డినగర్ లో డాక్టర్ సీతారాం,డాక్టర్ పోతున్న మానవత్వానికి మారు పేర్లుగా నిలిచారని,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ కౌన్సిలర్ వెంకటేష్ కురుమ అన్నారు.ఆదివారం డాక్టర్ సీతారాం,డాక్టర్ పోతున్న సంతాప సభను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన డాక్టర్ గా సీతారాం, డాక్టర్ పోతున్న చూపిన చొరవ మరువలేనిదన్నారు. పెద్దలకు, పిల్లలకు ఆరోగ్యం పట్ల మంచి సూచనలు ఇస్తూ ఎంతోమందిని కాపాడారని గుర్తు చేశారు.వారు భౌతికంగా మన మధ్యనా లేకపోయినా వారు అందరి గుండెల్లో నిలిచిపోతారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సిహెచ్.కృష్ణ గౌడ్,దత్తు ఏ.మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్, వెంకటరమణ, జైపాల్, భగవాన్ దాస్, నారాయణ, శివ, తిరుమల,వెంకటేష్ గౌడ్, కరుణాకర్ గౌడ్,నాయుడు,మాధవరెడ్డి,డాక్టర్ రత్నకిషోర్,డాక్టర్ అమరేందర్,డాక్టర్ భరత్ రెడ్డి,డాక్టర్ కృష్ణ,డాక్టర్ కుమార్,డాక్టర్ మురళి,డాక్టర్ జయప్రకాష్,డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్,విజయ్,అంజి,స్వామి, ఉప్పుగూడ శ్రీ బాబు దాస్ భక్త భజన మండలి వారు పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ**



**కామారెడ్డి,జనవరి05(సూర్య రేఖ)** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ అన్నారు.రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతిని బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ హాజరై మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కోసం కృషి చేస్తుందని ఆయన అన్నారు.ఒకే సంవత్సరంలో రైతు రుణమాఫీ చేయడం ఒక చరిత్ర అని,చిన్నచిన్న తప్పుల వల్ల కొంతమందికి రైతులకు రుణమాఫీ కాలేదని,వారికి త్వరలో రైతు రుణమాఫీ అవుతుందని రైతులు ఎవరు అధైర్య పడవద్దని ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీ మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని మరోసారి గుర్తు చేశారు.కేటీఆర్ కు ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప మరొకటి తెలియదని ఆయన అన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు గెలుచుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.సంక్రాంతి నుండి రైతు భరోసా కింద రూ.12 వేల రైతుల అకౌంట్లోకి వస్తాయని ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో చెప్పిన ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని ఆయన అన్నారు.

## బండారి సంతోష గంగాధర్ దంపతులను సన్మానించిన నవీన్ గుప్త



**శివంపేట,జనవరి05(సూర్య రేఖ)** మెదక్ జిల్లా శివంపేట మండల పిల్లుట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు,ప్రముఖ సంఘ సేవకులు,జాతీయ సేవారత్న అవార్డు గ్రహీత బీసీ నాయకులు బండారి సంతోష గంగాధర్ 20 వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్ గుప్తా మాట్లాడుతూ..ప్రజా నాయకుడు బండారి గంగాధర్ ప్రజలకు అనునిత్యం సేవా కార్యక్రమాలు చేస్తూ ఇలాంటి పెళ్లి రోజులు మరెన్నో జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వారాల గణేష్,వంజరి గౌరీ శంకర్,ఈ సారపు శ్రీనివాస్ గౌడ్,రాజా గౌడ్,సోను బాయ్,నర్సింలు గౌడ్,సరిగారి హరికృష్ణ,సీనియర్ జర్నలిస్ట్ గారి మల్లేష్,షేక్ అలీ,పిఎన్ జి యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# మణికొండలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి నూతన అసోసియేషన్ చొరవ





**రావుసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ రావు**

**గండిపేట్,జనవరి05** మణికొండలో బాల్ బ్యాడ్మింటన్ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేస్తుందని మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఆనంద్ రావు అన్నారు.ఆదివారం మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షుడు ఆనందరావు, ఉపాధ్యక్షులు నరహరి శాస్త్రి, హరినాథ్ రెడ్డి,కార్యదర్శి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారామరాజు, కోశాధికారి దేవేందర్ రెడ్డి,ఉపకార్యదర్శులు రమేష్, దుర్గారావు,ఆర్గనైజింగ్ కార్యదర్శిలు కోదండరామిరెడ్డి, రాజ్ కుమార్,కార్యవర్గ సభ్యులు నవీన్ కుమార్,శ్రీనివాస్ రావు, సంపత్, అప్పలరాజు, సయ్యద్ ఆసిన్, అహ్మద్‌లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ..స్థానికంగా బాల్ బ్యాడ్మింటన్ క్రీడను అభివృద్ధి చేసేందుకు నూతన అసోసియేషన్ పనిచేస్తుందని అన్నారు.ఈ మేరకు ప్రత్యేకంగా అసోసియేషన్ చొరవ చూపుతోందని వివరించారు. అంతేకాకుండా సంక్రాంతి వేడుకల తర్వాత బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అందరి సహకారంతో నిర్వహించడానికి కృషి చేస్తున్నామని వివరించారు.ఈ మేరకు చీఫ్ పాటర్న్ గా కౌన్సిలర్ నవీన్ కుమార్, ముఖ్య సలహాదారుగా అందె లక్ష్మణ్ రావులను ఎన్నుకోవడం జరుగుతుందని వివరించారు.

# లంగాడి ఛాంపియన్షిప్ కు రవిస్ బ్రిలియంట్ స్కూల్లో శిక్షణ కార్యక్రమం





**ప్రారంభించిన స్కూల్ కరస్పాండెంట్ రజనీకాంత్**

**రాజేంద్రనగర్,జనవరి05(సూర్యరేఖ)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ వేదికగా జరగబోయే 14వ జాతీయ జూనియర్ లంగాడి ఛాంపియన్షిప్ లో తెలంగాణ రాష్ట్రం తరఫున సత్తా చాటేలా క్రీడాకారులను సిద్ధం చేస్తున్నామని రవిస్ బ్రిలియంట్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్ఆర్ రజినీకాంత్ అన్నారు.ఈ మేరకు ఆదివారం పోటీలో పాల్గొనే జట్టుకు శిక్షణ శిబిరాన్ని రవిస్ బ్రిలియంట్ హైస్కూల్లో ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రజనీకాంత్ మాట్లాడుతూ...ఈ శిక్షణ రవిష్ బ్రిలియంట్ హైస్కూల్ కాటేదాన్ లో ఈ నెల 4 వ తేదీ నుంచి 8 వరకు ఇస్తున్నట్లు వివరించారు.9 నుంచి 12వ తేదీల్లో విజయవాడలో జరిగే జూనియర్ నేషనల్‌లో బాలికల జట్టు పాల్గొంటున్నాయన్నారు. తెలంగాణ జట్టులో పలు జిల్లా క్రీడాకారులు ఉన్నారని అన్నారు.ఈ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు.తెలంగాణ జట్టు లో పలు జిల్లా క్రీడాకారులు ఉన్నారు. బాలుర జట్టులో సాయిరాం, సుమిత్, కార్తీక్,హైమద్ (హైదరాబాద్), కిరణ్, అజయ్(నాగర్ కర్నూల్) విఘ్నేష్, శివ, ప్రసాద్, ఇస్మాయిల్, అరవింద్(రంగా రెడ్డి)భారత్, నితీశ్ (నల్గొండ),హర్ష( మెదక్), కోచ్-మహేందర్, పరమేశ్,బాలికల జట్టులో ఆకృతి, ఆరాధ్య, జన్నత్, హనీ (హైదరాబాద్), తేజస్విని, భార్గవి,దివ్య శ్రీ, నందిని, దుర్గామణి, దేవిశ్రీ (రంగా రెడ్డి), మహేశ్వరి, శివాని, నందిత (మెదక్), శివాని, నిఖిత (నాగర్ కర్నూల్) కోచ్ – మహేశ్వరి,రవీందర్ పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రీడాకారులు తమ సత్తా చాటేలా శిక్షణను ఇస్తున్నట్లు వివరించారు.

# సంక్రాంతి ముగ్గులు మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి





**ఇలాంటి కార్యక్రమాల్లో నేటి యువత స్వచ్ఛందంగా పాల్గొనాలి..**
**భావితరాలకు సంస్కృతిపై ఆసక్తిని పెంచేలా కార్యక్రమాలు చేపట్టాలి**
**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్,బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజులు**

**గండిపేట్,జనవరి05**మకర సంక్రాంతి వేడుకలు మన సంస్కృతి,సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు.సంక్రాంతి వేడుకల్లో వేసే ముగ్గులు అందర్నీ ఆకట్టుకుంటాయని వారు వివరించారు. ఆదివారం సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని ఓ పత్రిక,ఛానల్ ఆధ్వర్యంలో రాజ్ పుష్ప అట్రియాలో ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. అనంతరం వారు ముగ్గుల పోటీల్లో సత్తా చాటిన వారికి బహుమతులను బహూకరించారు.అనంతరం వారు మాట్లాడుతూ...ఇలాంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సాంప్రదాయాలను వ్యక్తీకరిస్తాయని అన్నారు. ముగ్గుల పోటీలు అంటే మహిళలు ఆసక్తి కనబరుస్తారని అన్నారు. మహిళలు మన సంస్కృతి,సాంప్రదాయాలను ప్రతిబింబించేలా వేసిన సంక్రాంతి ముత్యాల ముగ్గులు ఎంతగానో బాగున్నాయని అన్నారు.ఇదే విధంగా ముగ్గులను



భావితరాలకు వివరిస్తూ వారి చేత వేయిస్తూ మన సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేయాలని వివరించారు. యుగాలు మారినా తరాలు మారినా మన సంస్కృతి, సాంప్రదాయాల్లో మార్పులు రాకూడదని,ఈ మేరకు భావితరాలు ఇలాంటి కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి,నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్ నగపూర్ణ శ్రీనివాస్,వైస్ చైర్మన్ విజయ్ బాబు,గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్,నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్,మాజీ సర్పంచ్ అశోక్ యాదవ్,పాపి రెడ్డి,దుడ్డు కిరణ్,మాజీ సర్పంచ్ యాదగిరి,కౌన్సిలర్ దుర్గేష్,కౌన్సిలర్ కిరణ్,రాము పాల్గొన్నారు.

## కరాటే పోటీలో రామాయంపేట విద్యార్థికి బంగారు పథకం



**రామాయంపేట,జనవరి05(సూర్య రేఖ)** మెదక్ లో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలో రామాయంపేట కస్తూరిబా విద్యాలయానికి చెందిన హారిక బంగారు పతకాన్ని సాధించింది.17 సంవత్సరాలలోపు విభాగంలో కే దినేష్ కూతురు హారిక బంగారు పతకం సాధించినట్లు కోచ్ హరి తెలిపారు.ఈమెతో పాటు రామాయంపేట చెందిన మరో ఏడుగురు మెడల్స్ అందుకున్నారు.

## రాష్ట్రస్థాయి సేవ పురస్కార అవార్డు అందుకున్న పోచమ్మల అశ్విని



**రామాయంపేట,జనవరి05(సూర్య రేఖ)** పండగ సాయన్న రాష్ట్రస్థాయి సేవా పురస్కార అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బ్రిటిష్ పాలకుల చేతిలో భారతీయులు అల్లాడిపోతున్న సమయంలో పెద్దదారి వ్యవస్థను కూకటివేళ్లతో సహా కదిలించిన మహాత్ముడని,అలాగే తనను జైలులో నిర్బంధించగా జైలు గోడలను బద్దలు కొట్టుకొని వచ్చిన మహాబలవంతుడని,అలాగే ఉన్నవారి దగ్గర దోచి లేని వారికి పంచిపెట్టేవాడని,బలహీన వర్గాల ఆశాజ్యోతి పండగ సాయన్న అంటూ పండగ సాయన్న గురించి, ఆయన చేసిన ఎన్నో సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.బడుగు,బలహీన వర్గాల ప్రజలకు తాను చేస్తున్న సేవలను గుర్తించి నాకు మహనీయుడు తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న ముదిరాజ్ రాష్ట్రస్థాయి సేవా అవార్డు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో పండగ సాయన్న సేవా సంస్థ ఫౌండర్ శివ అందజేశారు.ఈ కార్యక్రమంలో పాశం యాదగిరి,మహిపాల్ యాదవ్,నిజ్జన రమేష్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## కొత్తగా ప్రారంభమౌతున్న ఫ్లై ఓవర్ కు సర్దార్ వల్లభాయ్ పటేల్ నామకరణం చేయాలి..

**బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి**



**రాజేంద్రనగర్,జనవరి05** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అరాంఘర్ నుండి జూ పార్క్ వరకు ట్రాఫిక్ కష్టాలు తీర్చడం కోసం అందుబాటులోకి తీసుకువస్తున్న ఫ్లైఓవర్ కు సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు పెట్టాలని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగుడెం మల్లారెడ్డి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రూ.799 కోట్ల రూపాయల ప్రజల ధనంతో జీహెచ్ ఎంసీ నిర్మించిన ఫ్లై ఓవర్ అరాంఘర్ చౌరస్తా నుంచి జూపార్క్ వరకు 6 లైన్లతో 4.08 కిలో మీటర్ల పొడువు,23 మీటర్ల వెడల్పు తో నిర్మించబడ్డ ఫ్లై ఓవర్ నేషనల్ పోలీస్ అకాడమీకి సమీపంగా వెళ్తున్న ఫ్లై ఓవర్ ను సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో వల్లాభాయ్ పటేల్ నామకరణం చేయాలన్నారు.

## రెచ్చిపోయిన కలప స్మగర్లు.. అటవీ సిబ్బందిపై దాడి.. వాహనాలు ధ్వంసం

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కేశవపట్నం గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అక్రమ కలప నిల్వ చేశారన్న ముందస్తు సమాచారంతో అటవీశాఖ దాడులకు దిగింది. లక్షల రూపాయల విలువైన కలపను స్వాధీనం చేసుకుంది. కలపను కాపాడుకునేందుకు రెచ్చిపోయిన స్మగ్లర్లు స్థానికుల సాయంతో అటవీశాఖ సిబ్బందిపై రాళ్ల దాడికి దిగారు. కర్రలు, రాళ్లతో అటవీశాఖ సిబ్బందిపై విరుచుకు పడ్డారు. దాడుల్లో బీట్ ఆఫీసర్ జాధవ్ నౌశిలాల్‌కు గాయాలయ్యాయి. రెండు ప్రభుత్వ వాహనాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. ఆదిలాబాద్ ఎస్పీ ఆదేశాలతో అటవీశాఖ సిబ్బందికి భద్రత కల్పించిన ఇచ్చోడ పోలీసులు గ్రామంలో కార్డన్ సర్చ్ చేపట్టారు. పది లక్షల రూపాయల విలువైన అక్రమ కలప గుర్తించారు. అటవీ శాఖ సిబ్బందిపై దాడికి దిగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కలప స్మగ్లర్లకు సహకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# యువత గలాన్ని వినిపించేందుకు గొప్ప వేదిక యంగ్ ఇండియా కే బోల్ సీజన్ 5






**డిసిసి కార్యాలయంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ఇండియా కే బోల్ కార్యక్రమం..**

**రాజేంద్రనగర్,జనవరి05** నేటి యువత ఎలుగెత్తి సమస్యలపై పోరాడి వినిపించడానికి యంగ్ ఇండియా కే బోల్ సీజన్ 5 కార్యక్రమం గొప్ప కార్యక్రమమని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్ రెడ్డి, జక్కిడి శివ చరణ్ రెడ్డి,కార్యక్రమం ఇంచార్జ్ నీతూ రామచంద్రన్ అన్నారు. ఆదివారం డిసిసి రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కొండకళ్ల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా కే బోల్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ. ఈ పోటీలో గెలుపొందిన వారికి యూత్ కాంగ్రెస్ స్పోక్స్ పర్సన్ గా అవకాశం కల్పించబడుతుందన్నారు.ఈ పోటీలో మూడు కేటగిరీలుగా ఉంటాయన్నారు. స్పీచ్,డిబేట్,రీల్స్ చేయడం వంటి ఒక్కో కేటగిరీలో గెలుపొందిన వారికి నేషనల్ లో మొదటి బహుమతి క్రింద రూ.50 వేలు, రెండవ బహుమతి కింద రూ.40 వేలు,మూడవ బహుమతి క్రింద రూ.25 వేలు,మహిళలకు ప్రత్యేక బహుమతి క్రింద రూ.40 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి లెవెల్ వచ్చేసరికి మొదటి బహుమతి క్రింద రూ.10 వేలు రెండవ బహుమతి క్రింద రూ.7500, రాష్ట్రస్థాయిలో మహిళలకు ప్రత్యేక బహుమతి క్రింద రూ.7500 ఇవ్వబడతుందన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొనే యువతి యువకులందరూ విత్ ఐవైసీ ఆఫ్,వైఐకేబీ వెబ్ సైట్ ద్వారా లాగిన్ అయి రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్ గౌడ్,గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, నాగార్జున,ఉపాధ్యక్షులు సాయి నికేష్ గౌడ్, దయ సాగర్ రెడ్డి, అనుకిరణ్ రెడ్డి,మహేశ్వరం నియోజవర్గ అసెంబ్లీ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు సికిందర్ రెడ్డి,చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు మైపాల్ యాదవ్, కార్యదర్శిలు యశ్వంత్, శ్రీకాంత్, రామకృష్ణ,శ్రీనాథ్ యాదవ్,నితిన్ యాదవ్,చందు యాదవ్, సామిడి చరణ్ రెడ్డి,ఫాజిల్,సామ వరుణ్, రవికాంత్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేర రహిత సమాజ నిర్మాణంలో సిసి కెమెరాల పాత్ర కీలకం






**ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం**

**ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి**

**మెదక్,జనవరి05(సూర్య రేఖ)** మెదక్ జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిదిలోని జీడిపల్లి గ్రామంలో దోమకొండ అనిత వెంకటరమణ సహకారంతో (68) సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాల,పట్టణ ప్రజలు,ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి తమ గ్రామాలలో విధిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సిసి కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని,దొంగతనాలు నివారించే అవకాశం ఏర్పడుతుందని అన్నారు.ఒకవేళ దొంగతనం జరిగినా సిసి కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవచ్చని చెప్పారు.సీసీ కెమెరాల ద్వారా ఎన్నో నేరాలు అరికట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా అన్ని గ్రామాలలో, పట్టణాల్లో సిసి కెమెరాల ఏర్పాటు చేసే విధంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని చెప్పారు.సీసీ కెమెరాల ద్వారా ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని,ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే తెలుసుకోవచ్చని సీసీ కెమెరాలు రాత్రింబవళ్లు 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని తెలిపారు. నేరాలను అదుపు చేయడం, అసాంఘిక కార్యకలాపాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించి పట్టుకోవడంలో సిసి కెమెరాలు ఎంతో ఉపయోగ పడతాయని చెప్పారు.ఎన్నో దొంగతనాలు, హత్యలు,రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సిసి కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకొని కేసులు చేధించడం జరిగిందని ఈ సందర్భంగా అన్నారు.ఒక్క సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానంగా పని చేస్తుందని అందువల్ల సిసి కెమెరాల ప్రాధాన్యాన్ని గుర్తించాలని కోరారు.అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలోని గ్రామాల్లో ప్రదాన కూడల్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు దాతలు ముందుకు రావాలని,ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పీ ఎస్.వెంకట్ రెడ్డి, తూప్రాన్ ఇన్స్పెక్టర్ రంగకృష్ణ మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్,ప్రజా ప్రతినిధులు, గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.

# చిత్తరమ్మ జాతర ఉత్సవాలను విజయవంతం చేయండి

**జాతర పత్రిక ఆవిష్కరించిన సగర సంఘం నాయకులు**



**రామాయంపేట,జనవరి05(సూర్య రేఖ)** ఈ నెల 24 నుండి రామాయంపేట పట్టణంలోని చిత్తారమ్మ జాతర ఉత్సవాలను ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని రామయంపేట పట్టనానికి చెందిన శ్రీ చిత్తారమ్మ సగర సంఘం నాయకులు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆహ్వాన పత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామాయంపేట పట్టణంలో సగరులు ఎంతో అంగరంగ వైభవంగా సుమారు నాలుగు రోజుల పైన ఈ జాతర ఉత్సవాలను ఎంతో నియమ నిష్ఠలతో మహిళలు మొదలుకొని యువకులు అందరూ పాల్గొని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ జాతర ఉత్సవాలు పట్టణానికి చెందిన సగరులు జాతర ఉత్సవాలు జరిగేనన్ని రోజులపాటు ఎంతో నియమ నిష్ఠలతో ఉండి ఉత్సవాలను అన్ని రకాలుగా విజయవంతంగా జరిపేందుకు తమ వంతు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.నిత్యం ఒక్కో ప్రత్యేకమైన పూజతో ఆలయంలో మహిళలతో పాటు యువకులు కుల పెద్దలు ప్రత్యేకమైన పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెండు బేడల అధ్యక్షులు సగర సంగం సభ్యులతోపాటు పూజారి నాగరాజు. తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు పొలంలో పడి వ్యక్తి మృతి



**రామయంపేట,జనవరి05(సూర్య రేఖ)** పొలం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పొలంలో పడి ఊపిరాడక ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన రామయంపేట మండలంలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రాయలపూర్ గ్రామానికి చెందిన గజం చంద్రం అనే వ్యక్తి తన వ్యవసాయ పొలం వద్ద మడి చదును చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి ఊపిరాడక చనిపోయారు.వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందినట్లు వారు తెలిపారు.

## రైతులు తిరగబడేందుకు సిద్దమయ్యారు : పెద్ది సుదర్శన్ రెడ్డి




ప్రభుత్వ హామీలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్ట్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఇవాళ హన్మకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పోలీసులు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. రైతు భరోసాపై డిప్యూటీ సీఎంను కలిసి రిప్రజెంటేషన్ ఇస్తామని పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆఫీస్ నుంచి బయటకు వెళ్లనీయకుండా బీఆర్ఎస్ కార్యాలయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి సహా పార్టీ నేతలను గృహ నిర్బంధం చేశారు. పోలీసులు బీఆర్ఎస్ కార్యాలయం చుట్టూ భారీగా మోహరించారు. ఈ నేపథ్యంలో పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు భరోసా విషయంలో కేబినెట్ నిర్ణయం రైతులకు విస్మయం కలిగించిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 70 లక్షల మంది రైతులను మోసం చేశారని.. ఆయన వెంటనే రాజీనామా చేయాలని పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. బోనస్ విషయంలో బోగస్ చేసిన్రు. 30 శాతం ధాన్యం కొనుగోలు చేశారు. నాలుగు విడతల్లో కూడా సరిగ్గా రుణమాఫీ చేయలేదన్నారు. నెక్కొండ మండలంలో 600 మందికి పైగా రైతులకు మాఫీ కాలేదు. రూ.7500 చెప్పిరూ.6 వేలకే పరిమితం చేశారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి చేసిన మోసాలపై రైతులు తిరగబడేందుకు సిద్దమయ్యారు. రేవంత్ రెడ్డి కేబినెట్ సహచరులే ఊర్లలో తిరగలేమని చెబుతున్నారు. మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు కూడా తప్పించుకుంటున్నారన్నారు. వరంగల్ నుంచే రైతుల తిరుగుబాబు మొదలైతది. రైతులకున్న రూ.17,500 బాకీ ఎవరు కట్టాలని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. సన్న, చిన్నకారు రైతులంతా వ్యవసాయ కూలీలే. జాబ్ కార్డున్న ఉపాధిహామీ కూలీలంతా వ్యవసాయ కూలీలే. జాబ్ కార్డుదారులందరికీ రూ.12 వేల ఇవ్వాల్సిందేనని .. వరంగల్ పర్యటనకు వస్తున్న డిప్యూటీ సీఎం బట్టి రైతులకు క్షమాపణ చెప్పాలని పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి రైతులను అప్పులపాలు చేసే కుట్ర చేస్తున్నారు. ఎకరాల చొప్పున రైతులకు ఎంత బాకీ ఉన్నానో చెప్పేలా పోస్టర్లు వేస్తున్నాం. ప్రతీ గ్రామంలో డబ్బుల వివరాలు ఊరూరా, ఇంటింటికీ పోస్టర్లు వేస్తాం. రైతులకు బాకీపడ్డ వివరాలతో కూడిన పోస్టర్ను విడుదల చేశామని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ అంటేనే మోసం, దగా రసమయి బాలకిషన్



**మానకొండూర్ రూరల్ :** ఆరో గ్యారంటీ అయిన రైతు బంధు కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఎలక్షన్ల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందేనని మానకొండూర్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో పల్లెమీద చౌరస్తాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో రైతు భరోసాకు రూ.15 వేలు ఇవ్వాలని రైతుల తరపున నిరసన, ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి మాట, ప్రతి హామీని విస్మరిస్తున్నారని, కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అని మళ్లీ మళ్లీ నిరూపించుకున్నదని మండిపడ్డారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలు మాత్రమే ఇస్తామంటూ మాట మార్చడం సరికాదన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చేదాకా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, శంకరపట్నం మండల అధ్యక్షుడు గంట మహిపాల్, తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, నియోజక వర్గంలోని బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



# హాట్ లుక్‌లో పొలిమేర నటి కామాక్షి భాస్కర్ల

పొలిమేర ఫ్రాంఛైజీతో నటిగా సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది హైదరాబాదీ ముద్దుగుమ్మ కామాక్షి భాస్కర్ల ఈ భామ విరూపాక్ష, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, రౌడీ బాయ్స్, ఓం భీమ్ బుష్ సినిమాలతో మంచి పాపులారిటీ సంపాదించుకుంది. 'సైతాన్' వెబ్‌సిరీస్‌లో బోల్డ్‌గా నటించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచిన ఈ భామ బోల్డ్ క్యారెక్టర్లు చేయడానికి రెడీ. అమాయక పాత్ర అయినా, బోల్డ్ క్యారెక్టర్ అయినా నటికి ఒకటేనని.. కథానుగుణంగా పాత్ర ఉంటుందంటూ దర్శకనిర్మాతల దృష్టిని తనవైపునకు తిప్పుకుంటోంది. పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలు చేస్తూ నటిగా తనను తాను నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్న ఈ భామ తాజాగా హాట్ లుక్‌లో కనిపిస్తూ కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మోడ్రన్ వేర్‌లో హొయలుపోతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. ఈ ఫొటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి.


## సినిమాల్లోకి అకీరా నందన్ ఎంట్రీ


పెళ్లి, పిల్లల తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న రేణూ దేశాయ్ 2023 లో రవితేజ టైగర్ నాగేశ్వర రావు సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఇందులో ఆమె పాత్రకు మంచి పేరు వచ్చింది. దీంతో రేణు మళ్లీ సినిమాల్లో బిజీ అవుతుందనుకున్నారు. అయితే అలాంటిదేమీ జరగలేదు. టైగర్ నాగేశ్వర రావు విడుదలై ఏడాదిన్నర గడిచినా ఇప్పటివరకు ఏ కొత్త సినిమాను అనౌన్స్ చేయలేదీ అందాల తార. ప్రస్తుతం సామాజిక సేవా కార్యక్రమాలతో రేణూ దేశాయ్ బిజి బిజీగా ఉంటోంది. అనాథ పిల్లలు, పర్యావరణం, మూగ జీవాల సంరక్షణ కోసం తన వంతు కృషి చేస్తుంటుంది. అలాగే తన ఫాలోవర్స్‌ని కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుతూ ఉంటుంది. ఇటీవలే మూగ జీవాల కోసం తన కూతురు ఆద్య పేరు మీదగా ఒక ఎన్‌జీవోను కూడా స్థాపించింది రేణూ దేశాయ్. కాగా చాలా రోజుల తర్వాత విజయవాడకు వచ్చిన ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొంది. మొదట ఇంద్ర కీలాద్రి అమ్మారిని దర్శించుకున్న ఆమె సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొంది. ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమానికి కూడా హాజరయ్యిందామె. ఈ సందర్భంగా రేణూ దేశాయ్ కు ఒక ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. 'మీ కుమారుడు అకీరా నందన్ సినిమాల్లోకి ఎప్పుడు వస్తున్నాడు' అని రేణూను అడిగారు. దీనికి స్పందించిన ఆమె.. ' ఈ సమయం కోసం నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఒక తల్లిగా మీ అందరికంటే నాకే ఎక్కువ ఆసక్తి ఉంటుంది. అతను ఎప్పుడు ఓకే అంటే అప్పుడే. అకిరా నందన్ ఇష్టంతోనే సినిమాల్లోకి రావాలి. అంతవరకు వెయిట్ చేయండి' అని చెప్పుకొచ్చింది రేణూ దేశాయ్. కాగా పవన్ కల్యాణ్ నటిస్తోన్న ఓజీ సినిమాలో అకీరా నందన్ నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుజిత్ తెరకక్కిస్తోన్న ఈ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామాలో పవన్ చిన్నప్పటి రోల్ అకీరా పోషిస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.



## షాహిద్ కపూర్ 'దేవా' టీజర్ రిలీజ్

బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం దేవా  బిగ్ బీ అమితాబ్ బచ్చన్ దేవా సినిమాను ప్రేరణగా తీసుకుని ఈ చిత్రం రూపొందుతుండగా.. మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రోస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. పూజ హెగ్డే, పావేల్ గులాటి తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జనవరి 31న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. టీజర్ చూస్తుంటే.. షాహిద్ రూత్‌లెస్ పోలీస్‌గా అలరించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా ఈ టీజర్‌ను మీరు చూసేయండి.



## బాలకృష్ణ 'డాకు మహారాజ్' ట్రైలర్ రిలీజ్

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డాకు మహారాజ్ వాల్తేరు వీరయ్యతో గతేడాది బ్లాక్ బస్టర్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్‌లో బాలయ్య డాకు మహరాజ్ పాత్రతో పాటు నానాజీ అనే డ్యూయల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఫుల్ యాక్షన్ వోల్టేజీతో ఉన్న ఈ ట్రైలర్ చూస్తుంటే బాలయ్య మరో హిట్ కొట్టబోతున్నాడని తెలుస్తుంది.

Ediited Printed & Published Mekkonda Premraj  on behalf MPR publications and Printed  RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,